


- మళ్లీ పెరిగిన సిలిండర్ ధరలు
- వంటగ్యాస్‌పై రూ.60 పెంపు
- గగ్గోలు పెడుతున్న వినియోగదారులు

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా చమురు, ఇంధనం రవాణాకు తీవ్ర ఆటంకం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో దేశీయంగా వీటి కొరత ఏర్పడుతుందని.. ధరలు పెరగొచ్చన్న ఆందోళనలు నెలకొనగా అదే నిజమైంది. దేశీయంగా చమురు కంపెనీలు కఠిన నిర్ణయం తీసుకున్నాయి. వంట గ్యాస్ సిలిండర్ ధరల్ని భారీగా పెంచేశాయి. 14.2 కిలోల గృహ వినియోగ వంట గ్యాస్ సిలిండర్ ధర ఒక్కసారిగా రూ. 60 పెరిగింది. దీంతో హైదరాబాద్ నగరంలో ఒక్కో సిలిండర్ ధర ఇంతకుముందు రూ. 905 గా ఉండగా.. ఇప్పుడు రూ. 965 కు చేరింది. పెరిగిన ధరలు మార్చి 7 అర్ధరాత్రి నుంచే అమల్లోకి వచ్చినట్లు ప్రకటన విడుదల చేశాయి. ఒక్కపక్క పెట్రోల్ డీజిల్ రోజువారి ధరల విధానంతో వాహనదారులపై ధరలమోత మోగిస్తున్న ఆయిల్ కంపెనీలు మరోపక్క గ్యాస్ బండనూ వదలకుండా ధరలు పెంచేస్తున్నాయి. సబ్సిడి గ్యాస్‌తోపాటు కమర్షియల్ బండ విషయంలో ఇష్టారాజ్యంగా ధరలను పెంచేస్తున్నారు. అయిల్ కంపెనీలు పక్కా ప్లాన్‌తో ధరలు పెంచుతూ వినియోగదారుల నెత్తిన భారాన్నిమోపుతున్నారు. చివరిసారిగా గతేడాది ఏప్రిల్‌లో రూ. 50 మేర పెంచాయి. దీంతో 11 నెలలుగా స్థిరంగానే ఉంటూ వచ్చాయి. కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరల్నే క్రమంగా మారుస్తూ వస్తుండగా ఇప్పుడు మాత్రం గృహ వినియోగ గ్యాస్ ధరల్ని కూడా ఒక్కసారిగా భారీగా పెరగడం సామాన్యులకు షాక్ ఇచ్చిందని చెప్పొచ్చు.గ్రేటర్‌పరిధిలో గ్రేటర్‌లో హైదరాబాద్ పరిధిలో డొమెస్టిక్ వినియోగదారులు 50నుంచి 60లక్షల మంది ఉండగా.. కమర్షియల్ వినియోగదారులు దాదాపు 50వేల నుండి 70వేల వరకు ఉంటారని, 6లక్షల కమర్షియల్ బండలు వినియోగిస్తున్నట్లు డీలర్లు చెబుతున్నారు.

**భారం అంతా సమాన్యుడిపైనే..**

ఓపక్క సాధారణ ప్రజలు ధరల భారంతో ఇబ్బంది పడుతుంటే..మరోపక్క కమర్షియల్ బండ వినియోగించే వ్యాపారులు కూడా సామాన్యులనే టార్గెట్ చేస్తున్నారు. ముఖ్యంగా కమర్షియల్ బండ ఉపయోగించే వారిలో పెద్దపెద్ద హోటళ్లు,రెస్టారెంట్లు మొదలుకొని చిన్నచిన్న టిఫిన్ సెంటర్లు,తోపుడు బండ్లపై వ్యాపారం చేసకునే వారు ఉంటారు. వీరిలో ఇప్పటికే పెద్దహోటళ్లు మెస్,ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు వంటి వారుకూడా ధరలు పెంచేస్తున్నారు. తాజాగా చిన్నచిన్న హోటళ్లు,స్నాక్స్ అమ్మేవారు టిఫిన్‌సెంటర్లు నిర్వహించుకునే వారు సైతం ధరలు పెంచేస్తున్నారు. కమర్షియల్ వినియోగదారుల్లో రోజుకు ఒక సిలిండర్ ఉపయోగించే వారిలో తోడుపు బడ్లువారు ఉండగా..పుడ్‌ట్రక్ చిన్నచిన్న టిఫిన్‌సెంటర్లు ఫాస్ట్‌పుడ్ నిర్వహించుకునే వారు రోజుకు రెండు బండలు వినియోగిస్తున్నట్లు సమాచారం. అలాగే పెద్దపెద్ద బార్లు నిర్వహించే వారిలో రోజుకు రెండు మూడు బండలు వినియోగిస్తునన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వ్యాపారులు తమపై పడే భారాన్ని నేరుగా రకరకాల పద్ధతుల్లో వినియోగదారులపై మోపుతున్నారు. జంటనగరాల్లో సాధారణ హోటళ్లు ,చిన్నచిన్న టిఫిన్ సెంటర్లు 15నుండి 20వేల వరకు ఉన్నాయి. పెద్దహోటళ్లు,రెస్టారెంట్లు బార్‌లు కలిపి 10వేల వరకు ఉన్నాయి. ఓవైపు వంట గ్యాస్ భారాన్ని మోస్తున్న వినియోగదారులు నెత్తిన పడుతుండగా ..మరోపక్క వ్యాపారులుసైతం సామాన్యుడిపైనే భారం వేస్తున్నారు.






కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యానవనంలో శనివారం గ్రేప్ ఫెస్టివల్ ఘనంగా ప్రారంభమైంది. పరిశోధన కేంద్రంలో 7 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక తోటను ఏర్పాటు చేసింది.ఇక్కడ సుమారు 59కి పైగా రకాల ద్రాక్ష పండ్లు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ఫెస్టివల్ కొనసాగుతుందని, స్టాక్ ఉన్నంత వరకే అనుమతి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఒకే చోట ఇన్ని రకాల ద్రాక్షలను చూడటంతో పాటు కొనుగోలు చేసే అవకాశం ఉండటంతో ప్రజలు భారీగా తరలివస్తున్నారు.

## ఎంఎంసిలో కంట్రోల్ రూమ్, ప్రత్యేక వాట్సాప్ నంబర్ : కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త**

ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో రెండవ రోజు కార్యక్రమాలు ఉత్సాహంగా కొనసాగాయి. పరిశుభ్రతను మెరుగుపరచడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంపొందించడం,ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలు చేపట్టబడ్డాయి. ఎంఎంసి పరిధిలోని 74 మున్సిపల్ వార్డులలో పరిశుభ్రతపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 1,684 మంది పాల్గొని 113. 638 టన్నుల ఘన వ్యర్థాలు, భవన నిర్మాణ వ్యర్థాలు సేకరించి తొలగించారు.అలాగే ఫైల్ క్లియరెన్స్‌లో భాగంగా 1,960 ఫైళ్లను పరిష్కరించారు.

**ఎంఎంసీ ప్రధాన కార్యాలయంలో కంట్రోల్ రూమ్...**

99 రోజుల ప్రణాళిక అమలును సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు తార్నాకలోని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసేలా ఈ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఎన్ఎసి ఇంజినీర్లను 24 గంటలు విధులు నిర్వహించేలా నియమించామని తెలిపారు.

**పరిశుభ్రతకు '9063421300' ప్రత్యేక వాట్సాప్ నంబర్..**

పరిశుభ్రతకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు 9063421300 అనే ప్రత్యేక వాట్సాప్ నంబర్‌ను కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి ప్రారంభించారు.చెత్త పేరుకుపోవడం, గ్రీన్ వ్యర్థాలు,జివిపిల వద్ద చెత్త కుండీలపై ప్రజలు ఫొటోలు, లోకేషన్ వివరాలతో వాట్సాప్‌లో ఫిర్యాదు పంపితే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటారని కమిషనర్ పేర్కొన్నారు.



రిటైర్డు ఆర్మీ అధికారులతో మాట్లాడుతున్న ఎంఎంసి కమిషన్ వినయ్ కృష్ణారెడ్డి, చిత్రంలో అడిషనల్ కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్ తదితరులు

**14 మంది రిటైర్డు ఆర్మీ అధికారుల సేవలు..**

క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారానికి 14 మంది రిటైర్డు ఆర్మీ అధికారుల సేవలను వినియోగించనున్నారు. ఈ మేరకు వారితో కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సమావేశమై పలు సూచనలు చేశారు. ఎంఎంసి పరిధిలో చెత్త సేకరణ సక్రమంగా జరగని ప్రాంతాలను గుర్తించడం, డిప్యూటీ కమిషనర్లు, పారిశుధ్య కార్మికులతో సమన్వయం చేసుకోవడం, చెతనత సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎంసి అడిషనల్ కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్, జెసి హెల్త్ మోహన్‌రెడ్డి, కంట్రోల్ రూమ్ ఓఎస్డీ ముకుందరెడ్డి పాల్గొన్నారు.

# బాబోయ్ ఎండలు

## భగ్గుమంటున్న భాగ్యనగరం



**హైదరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త**

సూర్యుడు మండే అగ్ని గోళంగా మారిపోయాడు. వేడి మామూలుగా లేదు. నగరంలో మార్చి మొదటి వారం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. ఎండల తీవ్రత, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న పరిస్థితి. ఉదయం11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయట తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని భారత వాతావరణ విభాగం అధికారులు కీలక సూచనలు చేశారు. ప్రస్తుతం గరిష్ట ఉష్ణోగ్రతలు 34 నుంచి 37 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. ఆది, సోమవారం 36 నుంచి 40 డిగ్రీల మధ్య గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. నగర శివారు ప్రాంతంలోని దుండిగల్, హకీంపేట్ ప్రాంతాల్లో 37 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి.గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎండల తీవ్రత ఎక్కువగా ఉండనుందని అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీలు అధికంగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయి.హైదరాబాద్‌లోనూ గత రెండు రోజుల్లో 2 డిగ్రీలు పెరిగాయని అధికారులు తెలిపారు. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో డీహైడ్రేషన్ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు చాలా అప్రమత్తంగా ఉండాలని పేర్కొంటున్నారు. గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 5 డిగ్రీలు పైబడితే వడగాలుల అలర్ట్ జారీ చేస్తామని ఐఎండీ అధికారులు వెల్లడించారు.

**ఈ జాగ్రత్తలు పాటించండి..**

ఇంట్లో ఉన్నప్పుడు ఏసీ లేదా ఫ్యాన్లు, కూలర్ల కింద ఉండాలి. ఇంట్లోకి వేడి గాలులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వడగాల్పులు ఇంట్లోకి చేరకుండా కర్టెన్లు ఉపయోగించాలి. వదులుగా ఉండే కాటన్ దుస్తులు మాత్రమే ధరించాలి. ఇవి చెమటను పీల్చి శరీరం చల్లబడేటట్లు చేస్తాయి. ఉదయం 11 తర్వాత మధ్యాహ్నం 3 లోపు ఎండలో తిరగకపోవటమే మంచిది. ఒకవేళ అత్యవసర పనిపై బయటకు వెళ్తే.. గొడుగు తప్పనిసరిగా ఉపయోగించాలి. ఇంట్లో ఉన్నా.. తరచూ నీరు తాగాలి. ఉప్పు కలిపిన నిమ్మరసం లేదా మజ్జిగ, కొబ్బరి నీళ్లు తీసుకుంటే ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా లభించి వడదెబ్బ బారిన పడకుండా కాపాడతాయి. ప్రతిఒక్కరూ రోజుకు కనీసం 3 లీటర్లు నీరు తాగాలి. ఎండలో పని చేసేవారు మరో లీటరు అదనంగా తీసుకోవాలి. వేసవిలో కలుషిత నీళ్ల ముప్పు అధికం. ఎక్కడ పడితే అక్కడ నీళ్లు తాగడం సరికాదు. బయటకు వెళ్లినప్పుడు ఇంటి నుంచి నీళ్ల బాటిల్ తీసుకెళ్లటం ఉత్తమమైన పని. తాజాగా వండిన ఆహారం తీసుకోవడంతో పాటు బయట తినడం మానుకోవాలి. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న రోగులు మరింత అప్రమత్తంగా ఉండి.

## బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పండుగలకు గుర్తింపు

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**



ఇఫ్తార్ విందులో సోదరులను ఉద్దేశించి మాట్లాడుతున్న కెటిఆర్

**పేట్ బషీరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త**

బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పండుగలకు అసలైన గుర్తింపు, గౌరవం దక్కిందని, నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పండుగలు ఉనికిని కోల్పోతున్నాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. శనివారం 129 సూరారం డివిజన్ టీఎస్ఐపీసీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నందు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరై ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మతాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ రంజాన్ తోఫా, బతుకమ్మ చీరలు, క్రిస్మస్ గిఫ్ట్‌లతో ప్రజా రంజక పాలన నాటి బిఆర్ఎస్ ప్రభుత్వానిదయితే, పండుగలను విస్మరిస్తూ బడ్జెట్లో కనీస కేటాయింపులు లేకుండా ప్రజలను గోస పెడుతున్న ప్రజా కంఠక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. రంజాన్ మాసం అనేది ఆత్మపరిశుద్ధి, సహనం, దానం, సోదరభావానికి ప్రతీక అని అన్నారు. ఉపవాస దీక్ష ద్వారా మనిషి తనలోని మంచితనాన్ని పెంపొందించుకుంటాడని, సమాజంలో ప్రేమ, ఐక్యత పెరగాలని ఈ పవిత్ర మాసం మనకు సందేశం ఇస్తుందని తెలిపారు. ఈ ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, అందరి జీవితాల్లో శాంతి, సౌభాగ్యం నెలకొనాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సోదరులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**కెబిఆర్ వాకర్ మెడలో గొలుసు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన అగంతకులు**

**జూబ్లీహిల్స్, మార్చి 7, ప్రభాతవార్త:**

కేబీఆర్ ఉద్యానవనంలో వాకింగ్‌కు వచ్చిన ఒక యువతి మెడలోని బంగారు గొలుసుతోపాటు సెల్‌ఫోన్‌ను ఇద్దరు అగంతకులు లాక్కొని పరారైన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. మాసబ్ట్యాంక్‌లోని శాంతినగర్ ప్రాంతానికి చెందిన గాయత్రి(32) బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవనంలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు వాకింగ్‌కు వచ్చి రాత్రి 9 గంటల ప్రాంతంలో తిరుగుముఖం పట్టింది. రోడ్ నంబరు 14లో నిలబడిన ఆమె వద్దకు నడుచుకుంటూ వచ్చిన ఇద్దరు అగంతకులు ఆమెను నెట్టేసి ఆమె మెడలోని 16 గ్రాముల బంగారు గొలుసు, చేతిలోని సెల్‌ఫోన్‌ను లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. జరిగిన సంఘటనపై ఆమె బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా బంజారాహిల్స్‌లోని క్యాన్సర్ ఆసుపత్రి కూడలిలో శుక్రవారం అర్ధరాత్రి తనిఖీలు చేయగా ఒక నిందితుడు సెల్‌ఫోన్‌తో పట్టుబడ్డారు. బంగారు గొలుసుతో ఉన్న మరో నిందితుడి జాడ లభించలేదు. దీంతో పోలీసులు అతన్ని పట్టుకొనేందుకు గాలింపు చేపట్టారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నెలవంకను తలపిస్తున్న 'బమ్మకున్ ఉద్ దౌలా'

**-నేడు సిఎం చేతుల మీదుగా ప్రజలకు అంకితం**



**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:**

పర్యావరణహితమైన నగరనిర్మాణం జరగాలన్న ప్రభుత్వ లక్ష్యం దిశగా హైడ్రా అడుగులేస్తోంది. మొదటి విడత పునరుద్ధరించ తలపెట్టిన 6 చెరువుల్లో గతేడాది అంబర్‌పేటలోని బతుకమ్మకుంటకు జీవంపోస్తే.. ఈ ఏడాది పాతబస్తీలోని బమ్మకున్ ఉద్ దౌలా లేక్ తో పాటు.. కూకట్‌పల్లి నల్లచెరువును అందుబాటులోకి తెస్తోంది. హైడ్రా అంటే కూల్చివేతలు కాదు.. నగర నిర్మాణం అనేట్టు నగరంలో రూపుదిద్దుకుంటున్న చెరువులు రుజువు చేస్తున్నాయి. నేల మీద నెలవంకను తలపించే విధంగా రూపొందించిన బమ్మకున్ ఉద్ దౌలా చెరువును సిఎం రేవంత్‌రెడ్డి ఆదివారం సాయంత్రం 7 గంటలకు ప్రారంభించనున్నారు. ఇందుకు అధికారులు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ప్రారంభోత్సవ సభకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. చెరువు చరిత్రను చెబుతూ తయారు చేసిన ఏవీ ప్రదర్శనకు వెసులుబాటుగా డిజిటల్ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. శనివారం చెరువు అభివృద్ధిని చూసి.. హైడ్రా అధికారులను స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అభినందించారు. ఆదివారం జరగనున్న కార్యక్రమాలను అధికారులతో సమీక్షించారు.

## రెండేళ్ల నిరీక్షణకు తెర.. బస్తీ వాసులకు డబుల్ ఊరట!

**-స్వామి వివేకానంద నగర్ బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ**

**చిక్కడపల్లి మార్చి 7 ప్రభాతవార్త :** తమ సొంతింటి కల చెదిరిపోయి రెండేళ్లుగా ఆవేదనలో ఉన్న శ్రీ స్వామి వివేకానంద నగర్ బస్తీ వాసులకు ఎట్టకేలకు న్యాయం చేకూరింది. ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పట్టాలను శనివారం సాయంత్రం హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, ఎం.అనిల్ కుమార్ యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, గాంధీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా పేదలకు న్యాయం జరగాలనే సంకల్పంతో చేసిన పోరాటం నేడు ఫలించిందన్నారు. బాధితులకు పట్టాలు అందడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, కాంగ్రెస్ నేత గుర్రం శంకర్, వివిధ పార్టీల డివిజన్ అధ్యక్షులు వి. నవీన్ కుమార్, అభిషేక్ కెనడి, రాకేష్‌లతో పాటు సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, సాయి గౌడ్, ఆనంద్ రావు, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో ఎంపీలు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎం .అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

## ప్రభుత్వ కార్యాలయాలు, పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

**-జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి**

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:**

ప్రభుత్వ కార్యాలయలు, కార్యాలయ పరిసరాల పరిశుభ్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన'ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టరేట్ ఆవరణలో గల కార్యాలయాలు, పరిసర ప్రాంతాలలో జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) జి. జితేందర్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి ఈ. వెంకటాచారి లతో కలిసి కలెక్టరేట్ లోని జిల్లా కార్యాలయాలు, వివిధ విభాగాల ఫైళ్ల ను పరిశీలించారు. అనంతరం ప్రాంగణం అన్ని మూలలను శుభ్రపరచాలని సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అలాగే అవసరంలేని ఫైళ్లు,పాత వాహనాలు ఇతర వస్తువులను గుర్తించి డిస్పోజ్ చెయ్యాలని ఆదేశిస్తూ ఈవిషయంలో జి.హెచ్.ఎం.సి సహాయం తీసుకోవాలని పరిపాలనా అధికారి విజయలక్ష్మికి సూచించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పాత వస్తువులు, అవసరంలేని వైర్లను సరైన పద్ధతిలో డిస్పోజ్ చేయాలని కలెక్టరేట్ ఐటీ టీం ఇన్‌ఛార్జి ప్రదీప్‌ను ఆదేశించారు.అనంతరం జిల్లా అధికారులతో కలిసి పరిశుభ్రత కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమర్థవంతమైన పాలన దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన "ప్రజాపాలనప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటి అంశం"పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిశీలన" ను కలెక్టరేట్‌లో అమలు చేయడం జరిగిందని అలాగే పరిశుభ్రత మనందరి బాధ్యత అని, మన చుట్టూ పరిసరాలు మన మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సిపిఓ డాక్టర్ సురేందర్ కుమార్, జిల్లా గిరిజనుల సంక్షేమ అధికారి కోటజీ, జిల్లా బిసి సంక్షేమ అధికారి జి.ఆశన్న, గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ అశోక్ చక్రవర్తి, కలెక్టరేట్ ఏవో విజయలక్ష్మి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ జ్యోతి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు రవి, శ్రీనివాస్, అపర్ణ, అరుణ, శ్రీధర్, వివిధ సెక్షన్ల సూపెరింటెండెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా పాతఫైళ్లు, సామాగ్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన, డిఆర్‌వో వెంకటాచారి తదితరులు

## పారిశుధ్యం మరింత మెరుగు పడాలి..జివిపిలను ఎలిమినేట్ చేయాలి

**-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

**హైదరాబాద్, మార్చి7, ప్రభాతవార్త:** 99 రోజుల ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నగరంలోపారిశుద్ధం మరింత మెరుగు పడాలనీఆ దిశగా అధికారులు, పారిశుద్ధ్య కార్మికులు కలిసికట్టుగా పనిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల"ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం నేపథ్యంలో ఖైరతాబాద్ జోన్‌లోని జూబ్లీహిల్స్ సర్కిల్ పరిధిలో జోనల్ కమిషనర్ ప్రియాంక అలతో కలిసి పారిశుద్ధ్య పనులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మొదట బంజారాహిల్స్‌లోని ఎన్‌బీటీ నగర్, అపోలో ఆసుపత్రి సమీపంలోని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల వద్ద జరుగుతున్న కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రెండు ప్రాంతాల్లో ఉన్న జీవీపీలు పూర్తిగా తొలగించాలనీ, పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.తదనంతరం బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆ ప్రదేశంలో ప్రజలకు ఉపయోగపడేలా పార్క్‌ను అభివృద్ధి చేయాలన్నారు.



పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేస్తున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జోనల్ కమిషనర్ ప్రియాంక అల తదితరులు

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో ఒక్క పారిశుద్ధం పై మాత్రమే కాకుండా జీహెచ్ఎంసీకి చెందిన అన్ని విభాగాలు కలెక్టివ్‌గాపని చేయాలన్నా రు. పార్కుల అభివృద్ధి, లేక్స్ క్లీనింగ్, రోడ్ల క్లీనింగ్, స్వయం సహాయక సంఘాల బలోపేతం, టౌన్ ప్లానింగ్, ఆస్తి పన్నుల చెల్లింపులు, జంక్షన్‌ల అభివృద్ధిరోడ్డు భద్రతా చర్యలు వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఆకస్మిక తనిఖీలో కమిషనర్ వెంట జూబ్లీహిల్స్ డిప్యూటీ కమిషనర్ శంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానంతో ఎంతో మంది ప్రాణాలు నిలబెట్టవచ్చు

### - డిఐజిపి ఉదయ భాస్కర్ బిల్లా



రక్తదానం చేస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు. చిత్రంలో డీఐజీపీ ఉదయభాస్కర్ బిల్లా

**చాంద్రాయణగుట్ట, మార్చి 7, ప్రభాతవార్త :** 87వ సీఆర్‌పీఎఫ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని చాంద్రాయణగుట్ట, హైదరాబాద్ గ్రూప్ సెంటర్‌లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గ్రూప్ సెంటర్ డీఐజీపీ ఉదయ భాస్కర్ బిల్లా ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి, రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బిల్లా రక్తదానం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రక్తదానం ప్రాణాలను కాపాడే గొప్ప సురక్షితమైన, నిస్వార్థచర్యన్నారు. ఒక సారి రక్తదానం చేస్తే ముగురికి సహాయపడుతుందని తెలిపారు. భయం, అపోహల కారణంగా చాలా మంది రక్తదానం చేయటానికి వెనుకాడటం విచారకరమన్నారు. రక్తదానం చేయటం సురక్షితం, సరళం, శీఘ్రమైన ప్రక్రియన్నారు. ఆరోగ్యవంతులైన పెద్దలు ప్రతి మూడు నెలలకు ఒకసారి సురక్షితంగా రక్తదానం చేయవచ్చన్నారు. సుమారు 120 మంది సీఆర్‌పీఎఫ్ అధికారులు, జవాన్లు, వారి కుటుంబ సభ్యులు తమ రక్తాన్ని దానం చేశారు. రక్తదాతలకు డీఐజీపీ ఉదయ భాస్కర్ బిల్లా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ కమాండెంట్ డాక్టర్ విలుబో, ఎంఓ/ఎసి డాక్టర్ పి.ఎస్. కల్యాణ్, డిప్యూటీ కమాండెంట్లు పి.చంద్రశేఖరన్, ధృవ్ నారాయణ్, అసిస్టెంట్ కమాండెంట్లు అనిల్ భాగేల్, ఆర్.రాజశేఖర్, సంజయ్ భుజబల్, రెడ్ క్రాస్ సొసైటీ డాక్లరు, గ్రూప్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై పోరాటం అనే నినాదంతో నిరసన దీక్ష



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు

**నిజాంపేట్, మార్చి 7, ప్రభాతవార్త**

జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆధ్వర్యంలో శనివారం ప్రగతి నగర్ సర్కిల్ వద్ద నిరసన దీక్ష నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాటం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె. యేసు రత్నం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు పాలబిందెల శ్రీనివాస్, పొన్నకంటి దస్తగిరి ఆధ్వర్యంలో ఈ నిరసన దీక్ష జరిగింది. అనంతరం యేసు రత్నం మాట్లాడుతూ నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అంబీర్ చెరువు, తూర్క చెరువు, బైన్ చెరువు, పాపయ్య కుంట, కొత్త కుంట వంటి చెరువుల్లో గుర్రపు డెక్కలు అధికంగా పెరగడంతో దోమల సమస్య తీవ్రమైందన్నారు. ముందుగా చెరువుల్లోని గుర్రపు డెక్కలను తొలగించి దోమలను నివారించాలన్నారు. అలాగే సర్కిల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్ పనులు పెండింగ్‌లో ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు, నర్సుల కొరత ఉండటంతో ప్రజలకు సరైన వైద్య సేవలు అందడం లేదని చెప్పారు. అలాగే జీహెచ్ఎంసీ నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం, బాచుపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే నిజాంపేట్ సర్కిల్, రెవెన్యూ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత మేకల నాగేష్, సిపిఐ నాయకులు జి. కృష్ణ, యాదయ్య, బ్రహ్మానందం, కేశవులు, ప్రకాష్, శివ, కృష్ణ, గంగన్న, పి. సింధూరి, పి. కవిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో ఫైల్ డిస్పోజల్ డే



ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్

**కొంపల్లి, మార్చి 7, ప్రభాతవార్త**

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు ఫైల్ డిస్పోసల్ డే శనివారం కొంపల్లి మున్సిపల్ కమిషనర్, సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కొంపల్లి సర్కిల్ 56లో వివిధ విభాగాలపైన పెండింగ్ ఫైళ్లను గుర్తించి వీటిని డిస్పోస్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ విభాగం 75 ఫైళ్లను, ఇంజనీరింగ్ విభాగం 6 ఫైళ్లను, టౌన్ ప్లానింగ్ విభాగం 23 ఫైళ్లను, శానిటేషన్ విభాగం 1 ఫైల్‌ను పరిష్కరించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రతి ఫైల్‌ను పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవడం ద్వారా ప్రజలకు తక్షణ పరిష్కారం అందించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మున్సిపల్ విభాగాల సమర్థత పెరుగుతుందని, పెండింగ్ ఫైళ్లను తగ్గించడమే కాకుండా ప్రజా సేవల నాణ్యతను మెరుగుపరచడంలో దోహదం అవుతుందని తెలిపారు. రెవిన్యూ, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులను చర్యలు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా ఆదేశించారు.

## వేం నరేందర్‌రెడ్డిని అభినందించిన మొగుళ్ళ రాజిరెడ్డి



**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త**

రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యే రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థి వేం నరేందర్ రెడ్డిని ఐ.ఎన్.టి.యు.సి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి అయన నివాసంలో కలసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువ, పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యలతోపాటు ప్రజాసమస్యల పరిష్కారానికి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలనీ ఈ సందర్భంగా వేం నరేందర్‌రెడ్డి కోరారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై పార్లమెంట్‌లో గళం విప్పాలని మొగుళ్ళ రాజిరెడ్డి కోరారు.



హైదరాబాద్ కాచిగూడాలో " ప్రజ్ఞా భారతి" ఆధ్వర్యంలో బౌద్ధిక, సాహిత్య మరియు కవితా సమావేశంలో ముఖ్య అతిథి డా. హృషికేశ్ పాండా, ఐఎస్ (రిటైర్డ్) పాల్గొన్నారు



జీహెచ్ఎంసీ ప్రజా సంబంధాల విభాగంలో అంతర్జాతీయ మహిళా సందర్భంగా మహిళా ఉద్యోగులను సన్మానిస్తున్న సిసిఆర్‌వో మామిండ్ల దశరథ, ఏఎంసి శారద తదితరులు



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం అడ్డగుట్ట డివిజన్‌లోని బుద్ధా నగర్‌లో జెండా ఎగరవేస్తున్న ఐద్వా ప్రతినిధులు అంజమ్మ తదితరులు



తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శనివారం సనత్‌నగర్‌లో ఉన్న బోర్డు కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సిబ్బంది



హెచ్ఏఎల్ రాఘవేంద్ర కళ్యాణిలో వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు



బాచుపల్లిలోని మమత హాస్పిటల్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్‌కోస్తున్న సైకాలజిస్టు పద్మశేష శారద లింగరాజు, ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ తదితరులు





అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో పాల్గొన్న బాయిస్ టౌన్ బ్రదర్ యేసు ప్రభాహరన్

# ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

## పౌల్ట్రీరంగంలో మహిళల పాత్ర అమోఘం : వక్తలు

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:**

దేశ ఆర్థిక వ్యవస్థలో, ముఖ్యంగా పౌల్ట్రీ రంగంలో మహిళలు పోషిస్తున్న పాత్ర అమోఘమని పలువురు ప్రముఖులు కొనియాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్, పౌల్ట్రీ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా చేవెళ్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ డి. సమత వెంకట రెడ్డి, ఎస్ఆర్ హ్యాచరీస్ సీతా రంజిత్ రెడ్డి, రెయిన్‌బో చీఫ్ క్లినికల్ న్యూట్రిషనిస్ట్ డాక్టర్ కిరాణ్మయిహాజరయ్యారు. ఈసందర్భంగా మహిళా సాధికారత, నాయకత్వ లక్షణాలు, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో పోషకాహార ప్రాముఖ్యతపై వారు తమ అమూల్యమైన అభిప్రాయాలను పంచుకున్నారు. ముఖ్యంగా పౌల్ట్రీ ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి ఏ విధంగా తోడ్పడుతున్నాయో డాక్టర్ కిరాణ్మయి వివరించారు. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్ సింగ్ బయాస్ మాట్లాడుతూ, గ్రామీణ ఉపాధి కల్పనలో మరియు పోషకాహార భద్రతలో పౌల్ట్రీ పరిశ్రమ కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఫామ్ మేనేజ్‌మెంట్ నుంచి కార్పొరేట్ నిర్ణయాల వరకు మహిళలు స్ఫూర్తిదాయక నాయకత్వాన్ని ప్రదర్శిస్తున్నారని, వారి విజయాలను గుర్తించి మరింత మందిని ఈ రంగం వైపు ప్రోత్సహించేందుకు పౌల్ట్రీ ఇండియా కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పౌల్ట్రీ రంగంలోని మహిళా ప్రతినిధుల విజయగాథలను అనుభవాలను వెలుగులోకి తెచ్చేందుకు అవుట్‌రీచ్‌కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. అదేవిధంగా, హైదరాబాద్ వేదికగా జరగనున్న 18వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పో 2026 వివరాలను కూడా ఈవేదికపై ప్రకటించారు. నవంబర్ 24న నాలెడ్జ్ డే నిర్వహిస్తామని, అనంతరం నవంబర్ 25 నుండి 27 వరకు ప్రధాన ఎక్స్‌పో కొనసాగుతుందని ఈ అంతర్జాతీయ ప్రదర్శనలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశ్రమల ప్రతినిధులు, సాంకేతిక నిపుణులు భారీ సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. ఈకార్యక్రమంలో పౌలీ్డ్ర ఇండి యా ట్రెజరర్ ఎం.శ్రీకాంత్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో మహిళా పారిశ్రామికవేత్తలు

## ఎంబిసి కులాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలి : రిటైర్డ్ డిజిపి పూర్ణచంద్రరావు

**హైదరాబాద్, మార్చి 7,ప్రభాతవార్త:** ఎంబిసి కులాలకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాలని రిటైర్డ్ డిజిపి పూర్ణచందర్‌రావు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సమాజ్ – బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన నాయి బ్రాహ్మణ సర్పంచులకు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు సంగెం సూర్యారావు ఆధ్వర్యంలో ఆత్మీయ అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ డిజిపి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం అన్ని కులాలకు సముచిత స్థానం కల్పించాలని, ప్రతి ఎంబీసీ కులం నుంచి అసెంబ్లీలో, పార్లమెంట్లో, రాజ్యసభలో కాలు మోపాలని కోరారు. నాయి బ్రాహ్మణులు 108 సర్పంచ్‌లు కావాలని కానీ 18 మాత్రమే అయ్యారని భవిష్యత్తులో రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలన్నారు..అన్ని కుల వృత్తులు కూడా ఈరోజు వ్యాపారంగా మారాయని అన్ని సేవకులకు ప్రభుత్వం మోడల్ షాపులు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్పూరి ఠాగూర్, కరుణానిధి, స్టాలిన్ లను ఆదర్శంగా తీసుకొని ఎమ్మెల్యేలు కావాలని ఆయన కోరారు. అధికార దాహంతో అగ్రవర్ణ నాయకులు ఖమ్మం లో దాదాపు 700 ఇళ్లను నేలమట్టం చేసి సామాన్యులను రోడ్డుపాలు చేశారన్నారు. ఇప్పుడు మనందరం మేల్కొనకపోతే భవిష్యత్తు తరాలకు ద్రోహం చేసిన వారమవుతామని అన్నారు.ఈకార్యక్రమంలో రవాణా శాఖ మాజీ అడిషనల్ కమిషనర్ సిఎల్ఎన్ గాంధీ, బీసీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు శివార్చక విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్,ప్రొఫెసర్ బాగయ్య, దేవరకొండ సైదులు,బీసీ కమిషన్ మాజీ మెంబర్ ఉపేందర్, హైకోర్టు న్యాయవాది అరుణ్ కుమార్, విశ్రాంత ఆర్డీవో బాలరాజ్ , మోడల జగదీష్ సాగర్, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గెలుపొందిన నాయి బ్రాహ్మణ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



నాయిబ్రాహ్మణ సర్పంచులను సన్మానిస్తున్న పూర్ణచందర్‌రావు, సంగెం సూర్యారావు తదితరులు

## అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

### -ముఖ్యమంత్రికి రాసిన లేఖకు వెంటనే స్పందించాలి
### -లేకుంటే ఆందోళన చేపట్టాల్సి వస్తుంది : కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 7 ప్రభాతవార్త**

అంబర్‌పేట్ ఫ్లైఓవర్ సర్వీస్ రోడ్డు పనులను కొందరు గుండాయిజంతో అడ్డుకునే ప్రయత్నం చేయడం విచారకరమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం అంబర్‌పేట ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు పనులను అధికారులు, బిజెపి నేతలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్లైఓవర్ ఇరువైపుల సర్వీసు రోడ్డు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో వాహనాలు, బస్సులు వెళ్లకుండా అడ్డుకోవడం కోసం ఎన్‌క్రోచ్‌మెంట్లు చేయడం ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందన్నారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ అధికారులు సరైన చర్యలు తీసుకోవాల్సిన సమయంలో మీనమేశాలు లెక్కిస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సర్వీస్ రోడ్డు పనులను పూర్తిచేయడంలో అధికారులు శ్రద్ధ చూపించడం లేదని, సర్వీస్ రోడ్డు నిర్మాణం పూర్తికావడమే కాకుండా, దాన్ని నిరంతరం మెయింటెన్ చేయడం కూడా అవసరమన్నారు. ప్రజలకు సౌకర్యం కలిగేలా సక్రమంగా నిర్వహణ జరగాలి. గతంలో ఈ సమస్యపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికి అనేకసార్లు ఉత్తరాలు రాసాను. అంబర్ పేట ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవం జరిగి నెలలు గడుస్తున్నా సర్వీస్ రోడ్డు పనులు మాత్రం ఇప్పటికీ పూర్తిచేయడం లేదని ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై దుమ్మెత్తి పోశారు.ప్రజలకు నష్టం కలిగే విధంగా రోడ్డు పనులను అడ్డుకుంటున్న వారిపై, బస్సులు వెళ్లకుండా ఎన్‌క్రోచ్‌మెంట్ చేసి గోడలు కట్టుకున్న వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని సర్వీస్ రోడ్డు పనులను పూర్తి చేసి ప్రజలకు ఉపయోగపడేలా చూడాలని కోరారు. లేదంటే స్థానిక ప్రజలను సంఘటితం చేసి ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.



అంబర్‌పేట్ ఫ్లై ఓవర్ సర్వీస్ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, చిత్రంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు

## మహిళల ప్రగతితోనే దేశాభివృద్ధి : హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి మార్చి 7 ( ప్రభాతవార్త ) :** మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశ ప్రగతిలో కీలక భాగస్వాములు కావాలని హర్యాన పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బండారు విజయలక్ష్మి ఆధ్వర్యంలో బండారు వైష్ణవ మెమోరియల్ ఫౌండేషన్ నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన బండారు దత్తాత్రేయ వివిధ రంగాలకు చెందిన మహిళా ప్రముఖులను సత్కరించి అభినందించారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర వెలకట్టలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా న్యాయమూర్తి జస్టిస్ మాధవిలత, పద్మశ్రీ అవార్డు గ్రహీత పద్మజారెడ్డి, ఇఫ్లూ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ సునైనా సింగ్, రమాదేవి, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రసంగకర్త డాక్టర్ అనంతలక్ష్మి, ప్రముఖ పాత్రికేయురాలు దీప్తి వాజపేయి తదితరులు పాల్గొని ప్రసంగించారు. మహిళలు సాధించిన విజయాలు భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. మహిళల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఫౌండేషన్ నిర్వాహకులు బండారు విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు సామాజిక కార్యకర్తలు, మహిళా నాయకులు, ప్రముఖులు పాల్గొన్నారు.



వివిధ రంగాలకు చెందిన మహిళలను సత్కరిస్తున్న

## హైడ్రా పేదల నడ్డి విరిచేది కాదు, ప్రభుత్వ స్థలాలను కాపాడేది : బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 7, ప్రభాతవార్త**

హైడ్రా పేదలను నడ్డి విరిచేది కాదని ప్రభుత్వ స్థలాలను కబ్జా చరల నుండి కాపాడుతుందనీ టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. కెపిహెచ్‌బి వసంత నగర్ డివిజన్‌లోని సాయి నగర్, సర్దార్ పటేల్ నగర్, భగత్‌సింగ్ నగర్ కాలనీలలో శనివా రం కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కాలనీవాసులు కాలనీ అసోసియేషన్స్ సభ్యులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే సం బంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. అనంతరం సర్దార్ పటేల్ నగర్ కాలనీలో వసం త నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సత్యం శ్రీరంగం, షేరి సతీష్ రెడ్డి, గాలి బాలాజీ, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ,కొప్పిశెట్టి దినేష్ కుమార్, దేశాల్, గంధం రాజు, గాదె శివ చౌదరి,మైఖేల్, పొదుగు అప్పారావు, చావా శ్రీనివాసరావు, సిరిపురం మధు, కిలారి బాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బండి రమేష్

## గుట్టలో సంత్ ఏక్‌నాథ్ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**చాంద్రాయణగుట్ట, మార్చి 7, ప్రభాతవార్త :**

పాతబస్తీ చాంద్రాయణగుట్ట పోలీసు స్టేషన్ ఎదురుగాగల సంత్ శ్రీ ఏక్‌నాథ్ స్వామి మందిరంలో మహారాజ్ 141వ వార్షిక షష్ఠి బ్రహ్మోత్సవాలు శనివారం అత్యంత వైభవంగా ప్రారంభమైయ్యాయి. ఉత్సవాలు ఈనెల 12వ తేదీ గురువారం వరకు జరుగుతాయి. శ్రీ పాండురంగవిఠలునుకి ఏక్‌నాథ్ స్వామి అత్యంత ప్రియ శిష్యుడు. ఆలయ నిర్వాహకులు కులదీప్ రాజ్ సక్సేనా ఆధ్వర్యంలో ఉదయం విఠల్ రుక్మిణీ స్థాపన, అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ గురు దత్త భజన మండలిచే భజనలు నిర్వహించారు. 8వ తేదీ ఆదివారం అభిషేకం, అర్చన, సాయంత్రం చాంద్రాయణగుట్ట మహిళా మండలిచే భజనలు, 9వ తేదీ సోమవారం ప్రభాత హారతి, భజనలు, కీర్తనలు, సాయంత్రం సంత్ ఏకనాథ్ మందిర భజన మండలిచే భజనలు, 10వ తేదీ మంగళవారం తెల్లవారు జామున కయాల్ బంధు, విఠల్ మందిరం, సుల్తాన్ బజార్ వారిచే భజనలు, కాకడ్ హారతి, సాయంత్రం డిండి, పాల్కీ, దహీ హాండీ, గోపాల్ కాలా, భండారా, 11వ తేదీ బుధవారం తెల్లవారు జామున పూజ, హారతి, భజనలు, కీర్తనలు, 12వ తేదీ గురువారం ఉదయం ప్రక్షాళ పూజ, సమాప్తి అభిషేకం, హారతి, భజనలు, కీర్తనలు ఉంటాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై సంత్ ఏక్‌నాథ్ మహారాజ్ దివ్య ఆశీర్వాదాలు స్వీకరించాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయానికి రంగుల వేసి మామిడి తోరణాలు, వివిధ రకాల పుష్పాలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.



ఆలయంలో కొలువైన పాండురంగవిఠలుడు రుక్మిణీ సమేత ఏక్‌నాథ్ స్వామి

## దోమల సమస్యపై సైబరాబాద్ కార్పొరేషన్ , నిజాంపేట్ సర్కిల్ కార్యాలయం ముట్టడి

**నిజాంపేట్, మార్చి 7, ప్రభాతవార్త**

మేడ్చల్ జిల్లా నిజాంపేట్ సర్కిల్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్ర దోమల సమస్యపై శనివారం బిజెపి పార్టీ నిజాంపేట్ సర్కిల్ నాయకులు 58 సర్కిల్ కార్యాలయాన్ని ముట్టడి చేయడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ డౌన్ డౌన్ కాంగ్రెస్ డౌన్ లోడ్ ఎమ్మెల్యే అధికారుల నిరక్ష్య వైఖరి నశిం చాలి అని పెద్ద ఎత్తున స్లొగన్స్ ఇస్తూ కమీషనర్ ఆఫీస్‌లో ధర్నా నిర్వహించారు. కాలనీలో మహిళలతో పాటు ప్రజలని వారితోపాటు తీసుకెళ్లి సమస్యలని నేరుగా కమీషనర్‌కి వివ రించి వివిధ డిపార్ట్‌మెంట్‌లని సమన్వాయం చేసి దోమల సమస్యను వెంటనే పరిష్కారం చేసేవరకు ధర్నా విరమిం చమని గట్టిగా స్లోగన్లు చేస్తూ నిరసన తెలుపుతూ మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సమస్యపై తక్షణమే రివ్యూ నిర్వహించి సంబంధిత అధికారులను పిలిచి వెంటనే ఫాగింగ్, దోమల నివారణ చర్యలలో చేపడతామని కమిషనర్ హామీ ఇవ్వడంతో బిజెపి నాయకులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో మూడు డివిజన్ల అధ్యక్షులు ప్రసాద్ రాజు, నరేంద్ర చౌదరి బిక్షపతి యాదవ్, దళిత మోర్చా రాష్ట్ర నాయ కులు దాసి నాగరాజు, కాసాని సంతోష్ గజ్జల్లి సంతోష్, సంతోష్ గౌడ్, ప్రహ్లాద్, కార్తీక్, అతీష్ బాబు, బీజేవైఎం రాజు తదితరులు పాల్గొన్నారు.

## పేద కుటుంబాలకు రేషన్ కిట్లు పంపిణీ



పాటిగడ్డ కమ్యూనిటీ హాలులో పేద కుటుంబాలకు రేషన్ కిట్లు పంపిణీ చేస్తున్న అభిషేక్ అడపా, షేక్ గౌస్ తదితరులు.

**బేగంపేట మార్చి 7,ప్రభాతవార్త**

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని బేగంపేట పాటిగడ్డ కమ్యూనిటీ హాలులో శనివారం సనత్‌నగర్ నియోజకవర్గం బేగంపేట డివిజన్ కాంగ్రెస్ యువ నాయకులు అభిషేక్ అడపా ఆధ్వర్యంలో పేద,ఒంటరి,మహిళలకు రేషన్ కిట్లను పంపిణీ చేసారు.సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోట నీలిమ నేతృత్వంలో బేగంపేట డివిజన్ లోని వివిధ బస్తీలలో పేద మైనార్టీ మహిళలు,ఒంటరి మహిళలకు రంజాన్ పండుగ ను పురస్కరించుకొని రేషన్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు అభిషేక్ అడపా తెలియజేసారు.రంజాన్ మాసంలో వారికి రేషన్ కిట్లను పంపిణీ చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.తమ అధినాయకురాలు కోట నీలిమ ఆదేశాల మేరకు బేగంపేట డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు షేక్ గౌస్,హనీఫ్ ఖాన్,బబ్లు, అజ్మత్, కలీం,నవాజ్,అక్బర్,మజీద్,అఫ్సర్,మునీర్‌ఖాన్,ఖలీం,ముక్తకర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,లబ్దిదారులు పాల్గొన్నారు.

## మన చరిత్ర సంస్కృతి విజయాలను భావితరాలకు అందించాలి : డా. ఏనుగు నరసింహారెడ్డి



రంగారెడ్డి జిల్లా సమగ్రస్వరూప గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహారెడ్డి, శివారెడ్డి, చెన్నయ్య, రామమూర్తి తదితర అతిథులు

**నాంపల్లి, మార్చి 7 ప్రభాతవార్త :** మన చరిత్ర, సంస్కృతి, వివిధరంగాల్లో సాధించిన ప్రత్యేక విజయాల విశేషాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు సర్వదా కృషిచేస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్తును అభినందించాల్సిందేనని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. శనివారం ఉదయం బొగ్గులకుంట తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని డా. దేవులపల్లి రామానుజరావు కళావేదికలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా నరసింహారెడ్డి హాజరై తెలంగాణ సారస్వత పరిషత్తు వెలువరిస్తున్న తెలంగాణ ప్రస్తుత 33 జిల్లాల చరిత్ర, సంస్కృతి, భాషా సాహిత్యం, పర్యాటక ప్రదేశాలు మొదలైన అంశాలకు సంబంధించిన సమగ్ర స్వరూప సంపుటాల పరంపరలో రంగారెడ్డి జిల్లా సమగ్ర స్వరూప గ్రంథాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షోపన్యాసంలో సురవరం ప్రతాపరెడ్డి ఆంధ్రుల సాంఘిక చరిత్రస్ఫూర్తితో పరిషత్తు 33 జిల్లా సమగ్ర సంపుటాల కృషిని ప్రారంభించినట్లు పేర్కొన్నారు.

## వేంనరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన జైపాల్‌రెడ్డి



వేంనరేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి దృశ్యం

**నార్సింగి, మార్చి 7 ప్రభాతవార్త :** రాజ్యసభ అభ్యర్థిగా ఎంపికైన వేంనరేందర్‌రెడ్డికి టిపిసిసి అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఉదయం వేంనరేందర్‌రెడ్డి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముంగి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి వేంనరేందర్‌రెడ్డి అంకిత భావంతో పని చేయడం వల్లనే, సీఎం రేవంత్‌రెడ్డి రాజ్యసభ అవకాశం ఇచ్చారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డ వారిని పార్టీ అధిష్టానం తప్పకుండా గుర్తిస్తుందని, మంచి అవకాశం ఇస్తుందనేందుకు వేంనరేందర్‌రెడ్డి నిదర్శనమని తెలిపారు. త్వరగా రాజ్యసభకు వెళ్లి తెలంగాణ ప్రాంత సమస్యలు లేవనెత్తి, పెద్ద ఎత్తున నిధులు తీసుకు రావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. మరిన్ని ఉన్నత పదువులు అధిరోహించాలని ఆ దేవుడినికి వేడుకుంటున్నామని ముంగి జైపాల్‌రెడ్డి తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ మామిడి నర్సింగ్‌రావ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగిడి ఓంప్రకాశ్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత మైకెల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పేదింటి ఆడబిడ్డలకు కళ్యాణలక్ష్మీ వరం : ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



ఖానాపూర్‌లో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృశ్యం

**నార్సింగి, మార్చి 7 ప్రభాతవార్త :** పేదింటి ఆడ బిడ్డలకు కళ్యాణలక్ష్మీ పతకం వరంగా మారిందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం గండిపేట మండలంలోని ఖానాపూర్ కమ్యూనిటీహాల్‌లో 62.మంది లబ్దిదారులకు రూ.62.లక్షల 7192వేలను చెక్కుల ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదింటి ఆడ బిడ్డల పెళ్లిళ్ళకు రూ.లక్షా 116. ఇచ్చి ఆదుకుంటుందన్నారు. రైతులు, మహిళలు, యువకులు, కార్మికులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని వివరించారు. అర్హులందరికి ప్రభుత్వ పతకాలు అందేలా నావంతు కృషి చేస్తానని ప్రకాశ్‌గౌడ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, నార్సింగి మార్కెట్ కమిటీ ఛైర్మన్ వేణుగౌడ్, మాజీ సర్పంచ్‌లు రామేశ్వరం నర్సిహ్మా, గండయ్య ముదిరాజ్, సహకార సంఘం ఛైర్మన్ తోల్‌కట్ట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## యువతకు నైపుణ్య విద్య ఎంతో అవసరం





వృత్తినైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సరోజ వివేక్ తదితర ప్రముఖులు

**బాగ్‌లింగంపల్లి, మార్చి 7,ప్రభాతవార్త :** యువత తమ ఉజ్వల భవిష్యత్తు కోసం కేవలం డిగ్రీలతో సరిపెట్టుకోకుం డా, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని కాకాస్ డా. బి.ఆర్. అంబేద్కర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ జి. సరోజా వివేక్ అన్నారు. శనివారం బాగ్ లింగం అంబేద్కర్ విద్యాసంస్థల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన వృత్తినైపుణ్య కేంద్రాన్ని సరోజ వివేక్ ప్రారంభించి ప్రసంగించారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యతో పాటు ప్రాక్టికల్ స్కిల్స్ ఉంటేనే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఎస్‌సీసీఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ (అడ్మిన్) నిమ్మ భాస్కర్ మాట్లాడుతూ యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఇలాంటి కేంద్రాలు ఎంతో దోహదపడతాయన్నారు. సంస్థల సీఈఓ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి మాట్లాడుతూ విద్యార్థులు ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా వివిధ రంగాల్లో శిక్షణ పొంది, ఉన్నతమైన కెరీర్‌ను నిర్మించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాప కులు, విద్యార్థులు మరియు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొ న్నారు.

## కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలి : బద్రి నాథ్ యాదవ్



డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నేత బద్రి నాథ్ యాదవ్

**కంటోన్మెంట్,మార్చి 7 ప్రభాతవార్త:** శుభకార్యాలు,సమావేశాలు వంటి కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు మోండా డివిజన్‌లోని లోహియ నగర్‌లో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నేత సి.బద్రి నాథ్ యాదవ్ శనివారం జిహెచ్‌ఎంసి బోయిన్‌పల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకూ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

## పండుగలను కలిసి జరుపుకోవడం భారతీయ సంస్కృతికి ప్రతీక : విజయారెడ్డి

**ఖైరతాబాద్, మార్చి 7 (ప్రభాతవార్త):**
అన్ని మతాల ప్రజలు పరస్పరం గౌరవించుకుంటూ పండుగలను కలిసి జరుపుకోవడం భారతీయ సంస్కృతికి ప్రతీక అని విజయారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఖైరతాబాద్ ప్రాంతంలోని ఇందిరా నగర్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి. విజయారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ముస్లిం సోదర, సోదరీమణులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొని రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది ఉపవాసం, సహనం, పరస్పర ప్రేమాభిమానాల సందేశాన్ని అందించే పవిత్రమైన కాలమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని అన్నారు. అలాగే ముస్లిం సోదరులు జరుపుకునే రంజాన్ పండుగను అందరూ ఆనందంగా, సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. స్థానిక ప్రజలు,యువత కలిసి ఇఫ్తార్ విందును ఎంతో సమన్వయంతో నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,కాలనీ వాసులు,ముస్లిం సోదరులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అందరూ కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొని పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

## ఘనంగా సీతారాముల కల్యాణం ఏర్పాట్లు



సీతారాముల కల్యాణ ఏర్పాటు కోసం పరిశీలిస్తున్న దృశ్యం

**సికింద్రాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:**
ముషీరాబాద్ లోని సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 27న జరిగే సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బీఆర్ఎస్ పార్టీ పద్మారావు నగర్ ఇంచార్జి పవన్ కుమార్ తెలిపారు. శనివారం ఆలయ ఈఓ సత్య మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ప్రతి సారి లాగే ఈ సంవత్సరం కూడా దేవాలయం బయటే కళ్యాణం జరపాలని నిర్ణయం తీసుకున్నారు. వేడుక జరిగే ఒక రోజు ట్రాఫిక్ మళ్లించాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పారిశుధ్య పనులు నిర్వహించలని, పవన్ కుమార్ గౌడ్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో చిలకలగూడ ఎస్ఐ రాకేష్, ట్రాఫిక్ ఎస్ఐ దుర్గా రెడ్డి, జీహెచ్ఎంసీ డీఈ భార్గవ్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏఈ రాజు లతో పాటు ఆలయ అర్చకులు శ్రీరామ్ మూర్తి, పరిచరక్ భార్గవ్, దేవాలయ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మాజీ సభ్యులు ముక్క శ్రీనివాస్, గోవింద్, తీళీళీ నాయకులు ఏసురి మహేష్ లక్ష్మిపతి, శివ ముదిరాజ్, మహేందర్ గౌడ్, హరి చారీ, నాగలక్ష్మి, అంబులెన్సు సురేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

### సమస్యలను పరిశీలించిన బిఆర్ఎస్ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి



సమస్యను పరిశీలిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి ఇతర బీఆర్ఎస్ నాయకులు.

**జూబ్లీహిల్స్, మార్చి 7, ప్రభాతవార్తః**
సమస్యలపై శంకారావం కార్యక్రమంలో భాగంగా బంజారాహిల్స్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి పర్యటించారు. నియోజకవర్గంలోని ప్రేమనగర్,ఆనంద్‌నగర్ కాలనీ, తుమ్మలబస్తి ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బుల్కాపూర్ నాలాలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని సంబంధిత అధికారులతో మాట్లాడారు. తక్షణమే సమస్యను పరిష్కారించాలని అధికారులకు సూచించారు. లేదంటూ రానున్న వర్షాకాలంలో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారన్నారు. గతంలో ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించలేదని బస్తి వాసులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ నాయుడు, విజయ్, శ్రీధర్ యాదవ్, ముర్తుజ, అన్వర్, యూసుఫ్ బాయ్, మల్లేష్, ఆనంద్, పద్మ, రాములమ్మ, వెంకీ ముదిరాజ్ ,శౌరి రాజ్, ధనరాజ్, పాల్గొన్నారు.

## తల్లి, భార్యే నాకు స్ఫూర్తి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి





కేకు కోస్తున్న ఎమ్మెల్యే భార్య మమత, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి

**అల్వాల్, మార్చి 7 ప్రభాతవార్త:**
అల్వాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. మచ్చబొల్లారం, వెంకటాపురం, అల్వాల్ డివిజన్లలో జరిగిన ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆయన సతీమణి మర్రి మమతలు విచ్చేశారు. తల్లి, భార్యలే తన సూర్తి దాతలు అని ఎమ్మెల్యే మర్రి స్పష్టం చేశారు. అల్వాల్‌లో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి నివాసంలో జరిగిన వేడుకలులో ఎమ్మెల్యే దంపతులు పాలు పంచుకున్నారు. మచ్చబొల్లారంలో మాజీ కౌన్సిలర్ దోలి రమేష్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం జరగగా ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. వెంకటాపురం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ ఆధ్వర్యంలో ఉత్సవం జరిగింది. లోతుకుంట శుభశ్రీ గార్డెన్స్‌లో సీనియర్ నేత శ్రీధర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో ఎమ్మెల్యేతో పాటుగా ఆయన సతీమణి మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొనగా పాటుగా ఆట పాటలుతో వేదిక హోరెత్తింది.

## మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మార్చి 7 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది కోటీశ్వరులుగా ఎదగాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కేజేఆర్ వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళలు అభివృద్ధి చెందేందుకు కంటోన్మెంట్‌ను ఎస్.జి.ఎఫ్.స్వచ్ఛంద సంస్థ గత కొన్ని సంవత్సరాల నుంచి మహిళలకు స్కిల్డ్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇప్పించి ఎంతో మందిని ప్రయోజకులుగా చేశామన్నారు.మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే వారి కుటుంబాలు భాగుంటాయన్నారు. వాకి ఎల్లప్పుడు తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆధ్వర్యంలో మహిళలకు బెలూన్స్,మ్యూజికల్ చైర్,డ్యాన్స్‌వంటి పోటీలు నిర్వహించి విజేతలకు విలువైన బహుమతులను ప్రధానం చేశారు.



కేజే.ఆర్ వైస్రాయ్ గార్డెన్‌లో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

ఈ వేడుకలకు కంటోన్మెంట్‌కు చెందిన వందలాది మంది మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, మహిళా నాయకులు నాగినేని సరిత, చిర్రబో యిన వైష్ణవి యాదవ్, ధనలక్ష్మి,భవానీ, గోమతి, శ్రీవాని,ధనశ్రీ,బాను,స్వాతి,మాధవి,మంజుల,భాగ్య పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నా : ఎమ్మెల్యే నవీన్‌యాదవ్

**జూబ్లీహిల్స్, మార్చి 7, ప్రభాతవార్తః**
జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నవీన్‌యాదవ్ పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తైన సందర్భంగా వందకు పైగా అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన శనివారం నియోజకవర్గంలోని అన్ని డివిజన్‌లలో మరిన్ని కార్యక్రమాలను ప్రారంభించారు. ఇందులో భాగంగా వెంకటగిరి హైలం కాలనీలో రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పైపులైను పనులకు, శ్రీకృష్ణనగర్‌లో, యూసుఫ్‌గూడ డివిజన్‌లో, ఏజీ కాలనీ డివిజన్‌లో, వెంగళ్‌రావునగర్ డివిజన్‌లో, ఎర్రగడ్డ డివిజన్‌లోని నటరాజ్‌నగర్, శంకర్‌లాల్ నగర్, సుల్తాన్‌నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్స్, సౌత్ శంకర్‌లాల్‌నగర్, ప్రేమ్‌నగర్, శివాజీనగర్, హేమవతినగర్, శాస్త్రి నగర్‌లు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. రహమత్‌నగర్ డివిజన్‌లో సీసీ రోడ్లు, 11కేవీ ఫీడర్ పనులను రూ. 80 లక్షలతో నూతనంగా ఏర్పాటుచేసిన స్పన్‌పోల్స్‌ను ఆయన కాంగ్రెస్ నేతలు సీఎన్‌రెడ్డి, భవానీశంకర్‌లతో కలిసి ప్రారంభించారు. బోరబండ డివిజన్‌లో పలు రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి పనులకు మాజీ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి తాను కట్టుబడి ఉన్నట్లు తెలిపారు.



రహమత్‌నగర్‌లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, భవానీశంకర్, సీఎన్ రెడ్డి తదితరులు.

### జెబిఎస్ నుంచి తుల్జాపూర్‌కు ప్రత్యేక బస్సులు

**అడ్డగుట్ట,మార్చి 7 ప్రభాతవార్త:** పుణ్యక్షేత్ర దర్శనాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హైదరాబాద్ నుంచి తుల్జాపూర్‌కు వెళ్లేందుకు సూపర్ లగ్జరీ బస్సులను ఏర్పాటు చేస్తున్నామని ఈ నెల 13 నుంచి సూపర్ లగ్జరీ బస్సులను నడపనున్నట్లు పికెట్ డిపో మేనేజర్ రవిందర్ తెలిపారు. ఆసక్తిగల భక్తులు ప్రయాణికులు ఎవరైనా ఉంటే 3500 రూపాయలు టికెట్ ధర ఉంటుందన్నారు. తుల్జాపూర్ టూర్ ప్యాకేజ్‌లో గానుగపూర్ . .దత్తాత్రేయ స్వామి,కొల్హాపూర్ .. మహాలక్ష్మి శక్తిపీటం, పండరిపూర్ . .విఠలేశ్వర స్వామి,తుల్జాపూర్ . . .భవాని మాత ఆలయాలను కూడా దర్శించుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తిగల వారు 7989982919, 93986441424 నెంబర్లను సంప్రదించాలన్నారు.

### త్వరలో అందుబాటులోకి ముక్తిధామ్ : మాజీ కార్పొరేటర్



అధికారులుతో ముక్తిధామ్‌ను పరిశీలిస్తున్న జితేందర్‌నాథ్

**అల్వాల్, మార్చి 7 ప్రభాతవార్త:** ముక్తిధామ్‌ను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకని వస్తామని మచ్చబొల్లారం మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. 1.90 కోట్లు వ్యయంతో ముక్తిధామ్ స్మశాన వాటికను అభివృద్ధి పరుస్తున్నారు. శనివారం అధికారులుతో కలిసి మాజీ కార్పొరేటర్ పనులను పరిశీలించడం జరిగింది. డ్రైనేజీ, మంచి నీటి పైపు లైన్లు, కర్మకాండల ప్లాట్‌ఫామ్, మెడిటేషన్ గది, ప్రహరీ గోడల నిర్మాణ పనులకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ వెంకటేశ్వర్లు, డిఇ ప్రశాంతి, ఎఇ రవళి ఇతరులు పాల్గొన్నారు.

### రైజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాధికారత కార్యక్రమాలు

- ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ డా. పద్మ వీరపనేని

**జూబ్లీహిల్స్, మార్చి 7, ప్రభాతవార్తః**
సమాజంలో మహిళలు, యువతను శక్తివంతం చేయడానికి రైజ్ ఫౌండేషన్ కీలక పాత్ర పోషిస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ డా. పద్మ వీరపనేని అన్నారు. రైజ్ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల ద్వారా మహిళలకు స్వయం సాధికారత కల్పించడం, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, ఆరోగ్యంపై అవగాహన కల్పించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు. సమగ్రాభివృద్ధి సాధించాలంటే ప్రతి వ్యక్తి ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాలని, సమాజ నిర్మాణంలో తన వంతు బాధ్యతను నిర్వర్తించాలని డా. పద్మ వీరపనేని ఆకాంక్షించారు. వైద్యురాలిగా ప్రారంభమై ప్రజాసేవ వైపు కదులుతున్న తన ప్రస్థానం వెనుక తన తల్లిదండ్రులైన విశ్రాంత ఐఏఎస్ అధికారి సి.వి.నరసయ్య, తల్లి లక్ష్మి ప్రేరణ ఎంతో ఉందన్నారు. అంతర్జాతీయ మహిళా దినత్సోవం సందర్భంగా రైజ్ ఫౌండేషన్ ద్వారా మరింత సేవ చేయడంతోపాటు రాజకీయాల ద్వారా ప్రజాసేవతో ప్రజలకు మరింత దగ్గర కావాలని భావిస్తున్నట్లు తెలిపారు. ప్రధాని మోడి స్ఫూర్తితో ముందుకెళ్తున్నట్లు వివరించారు.

### పేదలకు అన్ని వేళల అండగా నిలుస్తాం : ఎమ్మెల్యే



పర్వత్‌నగర్‌లో నివాసాల సమస్యలను పరిష్కరించేందుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలుపుతున్న కాలనీ వాసులు

**యూసుఫ్‌గూడ, మార్చి 7, ప్రభాతవార్త :**
పేదల పట్ల తాము ఎప్పుడూ సానుకూలంగా ఉంటూ వారిని అన్ని వేళల ఆదుకోవడం జరుగుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్ బస్తీవాసులు మర్యాదపూర్వకంగా వెళ్లి ఎమ్మెల్యేను కలిశారు. ఇటీవల కాలంలో బస్తీలో కొందరు బయట వ్యక్తులు తమ నివాసాల వద్దకు వచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని కొందరు బయట వ్యక్తులు తమ స్థలాలను ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ విషయంపై ఎమ్మెల్యే స్వయంగా ఆ ప్రాంతానికి వచ్చి ప్రజలకు ధైర్యం చెప్పారని తాము ఉన్నంత కాలం మీ నివాసాలకు గాని మీకు గాని ఎలాంటి ఇబ్బందులు తలెత్తవంటూ హామీ ఇచ్చారు. దీంతో కృతజ్ఞతగా బస్తీవాసులు ఎమ్మెల్యేను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొగళిరాజు, సి.బ్రహ్మ, శంకర్ గంగపుత్ర, విష్ణు, కృష్ణ పాల్గొన్నారు.

## యుద్ధంపై భారత్ మౌనం వీడాలి





నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న ఆల్ ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ అధ్యక్షులు అజీజ్ పాషా

**ధర్నాచౌక్, మార్చి 7, ప్రభాతవార్త:** ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధంపై భారత్ ప్రభుత్వం మౌనం వీడాలని ఆల్ ఇండియా తంజీమ్ ఎ ఇన్సాఫ్ అధ్యక్షులు, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా డిమాండ్ చేశారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికాల సంయుక్త దాడిని నిరసిస్తూ శనివారం ఇందిరాపార్కు వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా అజీజ్ పాషా మాట్లాడుతూ యుద్ధం మొదలైన ఐదు రోజుల్లోనే అమాయకుల ప్రాణాలు బలితీసుకోవటమే కాకుండా లక్షలాది మంది సామాన్య ప్రజలు నిరాశ్రయులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా మిత్ర దేశమన స్పెయిన్, ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని విమర్శించారు. ఇరిస్దెనా నౌక లక్ష్యంగా 80 మంది భారతీయ సైనికులను అమెరికా హతమార్చినప్పటికీ, అమెరికా–ఇజ్రాయెల్ దురాగతాలపై భారత ప్రభుత్వం కనీసం స్పందించకపోవటం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో తంజీమ్ ఎ ఇన్సాఫ్ నాయకులు మునీర్ పటేల్, ఎఐవైఎఫ్ నాయకులు బాల్కృష్ణన్, సిపిఐ నేతలు పాల్గొన్నారు.

### చిన్నారి రమ్య కేసులో నిందితుడికి రెడ్ కార్నర్ నోటీసు జారి

**జూబ్లీహిల్స్, మార్చి 7, ప్రభాతవార్తః** బంజారాహిల్స్ రోడ్ నంబరు 3లో తొమ్మిదేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన చిన్నారి రమ్య మృతి సంఘటన కేసులో విదేశాల్లో ఉన్న నిందితుడికి ఒకరికి బంజారాహిల్స్ పోలీసులు రెడ్ కార్నర్ నోటీసు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. 2016 జులై 1న బంజారాహిల్స్ రోడ్ నంబరు 3లోని ఛట్నీస్ ఎదురుగా రోడ్డు ప్రమాదం చోటు చేసుకొంది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న చిన్నారి రమ్యతోపాటు ఆమె తాత మధుసూదనాచారి, బాబాయి రాజేష్ మృతిచెందగా చిన్నారి తల్లి తీవ్ర గాయలపాలైంది. ఈ సంఘటనలో ప్రధాన నిందితుడిగా కారు నడుపుతున్న శ్రావిల్ ఉండగా కారు యజమాని అయిన కె. విష్ణువినీత్ రెండో నిందితుడిగా ఉన్నాడు. సంచలనం సృష్టించిన ఈ కేసులో విష్ణువినీత్ అమెరికాకు వెళ్లిపోయాడు. కాగా మార్చి 17న నాంపల్లి సెషన్స్ కోర్టులో సాక్షుల విచారణ ఉంది. కాగా విదేశాల్లో ఉన్న విష్ణువర్ధన్‌కు బంజారాహిల్స్ పోలీసులు ఇటీవల రెడ్ కార్నర్ నోటీసును జారీ చేశారు.

### ప్రశ్నిస్తేనే మహిళలకు హక్కులు లభిస్తాయి : కంచె ఐలయ్య

**మెహిదీపట్నం, మార్చి 7, ప్రభాతవార్త :**



మహిళలు ప్రశ్నిస్తేనే వారి హక్కులు వారు పొందుతారని ప్రముఖ రాజకీయ సిద్ధాంత వేత్త ప్రొఫెసర్ కంచె ఐలయ్య అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుండే ప్రశ్నించడం అలవర్చుకోవాలని సూచించారు. మెహదీపట్నం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా అకాడెమిక్ కాన్క్లేవ్ మరియు శ్రేయసి అవార్డు ప్రదానోత్సవం – 2026 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సెంటర్ ఫర్ ఉమెన్స్ స్టడీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం విద్యార్థినుల స్వాగత నృత్యంతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కంచె ఐలయ్య తో పాటు తొలి మహిళా డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎస్ గ్లోరి స్వరూపలు హాజరై ప్రసంగించారు. మహిళల సాధికారత, సామాజిక సమానత్వం మరియు విద్య ప్రాముఖ్యతపై వారు తమ ఆలోచనలు పంచుకున్నారు. మహిళలు ప్రశ్నిస్తేనే వారికి హక్కులు లభిస్తాయని , ప్రశ్నించడం విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థినులు నేటి మహిళలు సామాజిక సమస్యలు వంటి అంశాలపై ఫోటో ప్రదర్శన , డిబేట్లు , స్కిట్లు చేసి అందరిని ఆలోచింప చేసారు .ఈ సందర్భంగా సఫా ఇండియాకు చెందిన సామాజిక వేత్త రుబీనా నఫీస్ ఫాతిమాకు శ్రేయసి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సిస్టర్ డాక్టర్ విజయ రాణి, సిడబ్ల్యూ డైరెక్టర్ కయలవిలీ, కాలేజీ డీన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సికింద్రాబాద్ ఆర్ఆర్‌సి మైదానంలో సికింద్రాబాద్ పోలీస్ జోన్ క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సికింద్రాబాద్ జోన్ డిసిపి రక్షి తమూర్తి హాజరై గెలుపొందిన చిలకలగూడ డివిజన్ జట్టు కు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు.

## మహిళలపై ప్రభావం చూపే వ్యాధులపట్ల అవగాహన కలిగి ఉండాలి : యూపిహెచ్‌సి వైద్యాధికారి మనోజ్‌రెడ్డి

**ముషీరాబాద్, మార్చి 7, ప్రభాతవార్త:** మహిళలపై ప్రభావం చూపే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే వాటిని తేలికగా జయించగలుగుతామని ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఆయన మహిళలు–ఆరోగ్య సమస్యలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రధానంగా ఎదుర్కొనే సాధారణ వ్యాదులు, వాటి లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా మహిళల్లో అత్యంత ప్రబలంగా ఉన్న క్యాన్సర్‌లలో రొమ్ము క్యాన్సర్ ఒకటని తెలిపారు. రొమ్ములో ముద్ద, రొమ్ము పరిణామంలో మార్పులు, చర్మ మార్పులను బట్టి మహిళలు స్వీయ రొమ్ము పరీక్ష ద్వారా ముందస్తుగా గుర్తించవచ్చునని అన్నారు. అండాశయ క్యాన్సర్ ప్రతి సంవత్సరం అనేక మంది మహిళల ప్రాణాలను బలిగొంటోందని గుర్తు చేశారు. అండాశయ క్యాన్సర్‌కు సంబంధించి లక్షణాలు అస్పష్టంగా ఉంటాయని, కటి మరియు ఉదరంలో వ్యాపించే వరకు దీనిని గుర్తించటం సవాలుతో కూడుకున్నదని తెలిపారు. అండాశయ క్యాన్సర్ యొక్క కుటుంబ చరిత్ర ఉన్న మహిళలు జన్యు సలహా మరియు పరీక్షల ద్వారా కొంతవరకు ప్రయోజనం పొందవచ్చునని అన్నారు. మంచి ఆహార అలవాట్లు, సరియైన నిద్ర, ఆరోగ్యకరమైన పరిసరాలు, తగినంత వ్యాయామం, యోగా, మెడిటేషన్ వంటి మంచి అలవాట్లను అవలంభిస్తూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండటం ద్వారా మహిళలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించవచ్చునని సూచించారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మనోజ్‌రెడ్డి

### అడిషనల్ డిజిపిని కలిసిన బిజెపి మైనార్టీ నాయకులు

**చార్మినార్,మార్చి 7 ప్రభాతవార్త :** మొదటి ఇమామ్ హజ్రత్ ఇమామ్ అలీ సంతాప దినాలు సందర్భంగా పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర అడిషనల్ డిజిపి మహేష్ మురళీధర్ భగవత్‌ను కలిసి బిజెపి మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ వినతి పత్రం అందజేశారు.మార్చి నెల 8నుంచి 12వ తేదీ వరకు మొదటి ఇమామ్ హజ్రత్ ఇమామ్ అలీ సంతాప దినాలు జరుగుతన్నందున షీ టీమ్స్,టాస్క్‌పోర్సు బలగాల సంఖ్యను పెంచాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్య లేఖను ఆయన అడిషనల్ డిజిపి ఎంఎం భగవత్‌కు అందజేశారు.ఈ సందర్భంగా బిజెపి మాజీ మైనార్టీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ మాట్లాడుతూ మొదటి ఇమామ్ హజ్రత్ ఇమామ్ అలీ సంతాప దినాలు సందర్భంగా అవసరమైన బందోబస్తును ఏర్పాటు చేయనున్నామని అడిషనల్ డిజిపి ఎంఎం భగవత్ తెలియజేశారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయనతో పాటు పలువురు పాల్గొన్నారు.



రాష్ట్ర అడిషనల్ డిజిపి ఎంఎం భగవత్‌కు వినతి పత్రం అందజేస్తున్న బిజెపి మైనార్టీ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ

### వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జీ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలార్‌దేవ్‌పల్లి,మార్చి 7 ప్రభాతవార్త :** వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఇంఛార్జి తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్‌లో సీనియర్ బిజెపి నాయకులు సంతు గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎటిజి ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ కళ్ల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినందుకు ఆయన నిర్వహకులను అభినందించారు.ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రావుల భాస్కర్,మారు మురళీ,గోపాల్ నాయక్, భూషణ్. ప్రభుదాస్,గురుస్వామి,రంజిత్ సింగ్,భరత్,రమేష్ రెడ్డి,శంకర్ రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### చలో గన్‌పార్క్ పేరిట 10న 'గ్రేట్ మిలియన్ మార్చ్ డే'

**సైఫాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** చలో గన్‌పార్క్ పేరిట ఈ నెల 10వ తేదీన తెలంగాణ అమర వీరులను స్మరించు కుందాం, తెలంగాణ హ క్కుల దినంగా పాటిద్దాం, ఉద్యమ ఆకాంక్షలను సాధించుకుం దాం అనే నినాదంతో 'గ్రేట్ మిలియన్ మార్చ్ డే'ను నిర్వహి స్తున్నామని తెలంగాణ ఉద్యమకారుల జెఏసి (టియుజెఏసి) తెలిపింది.శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ ఉద్య మ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న ఉద్యమ కారులు ఈ మార్చ్‌కు సంబంధించిన వాల్‌పో స్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జెఏసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుమ్మల ప్రఫుల్ రామ్‌రెడ్డి, కె.చంద్రశేఖర్ ప్రసాద్, ఉద్యమ నేతలు గోల్లపల్లి దయానం దరావు, మంచాల వెంకటస్వామి, షేక్ షావ లి, గుండా యాదగిరి, గోగిరాల సుధాకర్, ఎండి ఏక్బాల్, వేముల యాదగిరి, జానికిరెడ్డి, ధనలక్ష్మి, సదానందం, గోగిరాల సుజీ తదితరులు పాల్గొన్నారు.



### జీవితంలో విద్యార్థులకు చదువు ఎంతో ప్రాముఖ్యం





మత్స్యశాఖ సంఘం చైర్మన్ మెట్టుసాయికుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**బేగబజార్, మార్చి 7ప్రభాతవార్త:**
విద్యార్థులకకు పదవ తరగతి పరీక్షలు జీవితంలో చదువు ఎంతోప్రాముఖ్యత నేర్పుతుందని ప్రముఖ విశ్లేషకుడు కృష్ణ చైతన్యరెడ్డి అన్నారు.(టిఆర్ఎస్ఎంఎ)ఆసిఫ్‌నగర్ సౌజన్యంతో రిలయన్ హైటెక్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జియాగూడలోనిఎస్.బి.ఎ గార్డెన్‌లో పదవ తరగతి విద్యార్థులకు ఓరియాటేషన్(ప్రేరణ)కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పదవ తరగతి పరీక్షలకు ఎలా సిద్దంగా కావాలో వివరించారు.రాజ్యసభసభ్యులు మందడి అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి పరీక్షలుసవాలు అన్నారు.పరీక్షలకు సిద్దంగా ఉండి బయపడ కుండా పరీక్షలు వ్రాయాలన్నారు.పదవతరగతి పరీక్షలు విద్యార్థులకు జీవితంలో ఎదగడానికి ప్రేరణ అన్నారు.యువతి,యువకులు ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు.ఈకార్యక్రమంలో మ త్స్యసహకార సంఘం చైర్మన్ మెట్టుసాయికుమార్, టిఆర్ ఎస్ఎ అధ్యక్షులు రవికమార్, గౌరవఅధ్యక్షులు గాలయ్యలు ప్రసంగించారు.కార్యక్రమంలో టిఆర్ఎస్ఎంఎ ప్రతినిధి రామ్ కుమార్,ముస్తాక్అహ్మద్,హబీబ్‌షేక్,బాల్‌రాజ్,రతన్‌ప్రకాష్‌జైస్వాల్,ఇర్ఫాన్‌బేగ్,అన్వేష్,మిథిలేష్‌తదితరులు పాల్గొన్నారు. వందలమంది విద్యార్థులు పాల్గొన్నారు.

### ఉపాధ్యాయులపాత్ర సమాజ పురోగతిలో కీలకం

-భారత్‌వికాస్‌పరిషత్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు శ్రీకాంత్‌యాదవ్

**కుత్బుల్లాపూర్, మార్చి 7 ప్రభాతవార్త**
సమాజానికి అత్యుత్తమ పౌరులను అందించడంలో తల్లిదండ్రులకన్నా ఉపాధ్యాయుల పాత్రే కీలకమని భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతల్ పట్వారీఎవ్లేవ్‌లోని నవజ్యోతి హైస్కూల్‌లో విద్యాసంస్థల చైర్మెన్, పాఠశాల కరస్పాండెంట్ మలిపెద్ది ఇందిరారెడ్డి, భారత్ వికాస్‌పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నరేంద్రకృష్ణ, పాఠశాల డైరెక్టర్ విఆదిత్యకృష్ణ, ప్రపంచ మానవహక్కుల సమితి జాతీయ డైరెక్టర్ మధుబాబు చికిలె తదితరుల ఆధ్వర్యంలలో 150మంది ఉపాధ్యాయులకు ప్రోత్సహక ప్రశంశా పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భావితరాలకు దిక్సూచిలా మారాలంటే అదికేవలం ఉపాధ్యాయుల శిక్షణవల్లే సాధ్యమన్నారు. నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్, కరస్పాండెంట్ మలిపెద్ది ఇందిరారెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాలుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందన్నారు. ఈ సందర్భంగా నవజ్యోతి విద్యాసంస్థల కృషిని గుర్తించి ఇంతగొప్పగా ఉపాధ్యాయులను సత్కరించే బృహత్ అవకాశం కల్పించిన భారత్ వికాస్‌పరిషత్ సంస్థలకు ఆమె ప్రత్యేక కృతజ్ఞ తలు, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాస్ ముది రాజ్, హెల్పింగ్‌హార్ట్స్ సొసైటీ నిర్వాహకులు తూటే విజయ్ కుమార్, కాంగ్రెస్ నాయకులు కట్టే శ్రీకాంత్ యాదవ్ పాల్గొన్నారు.


వార్త CLASSIFIEDS వార్త

**CHANGE OF NAME**

★ I, NAVEEN CHAND (Old Name) S/o. Mahaveer Chand R/o. 10-7-49, Line Bazar, Chilkalguda, Sec-bad-3. have changed my name as MAHAVEER NAVEEN CHAND (New Name) vide affidavit dt 04.03.26

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

తెలంగాణ ప్రభుత్వం
**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ - జీడిమెట్ల సర్కిల్-55**

నిట్ నం. & తేది: 01/DB/EE/జీడిమెట్ల సర్కిల్/CMC/2025-26, తేది: 07.03.2026
పని పేరు: పూడికతీత పనులు (4 సం.లు), అంచనా మొత్తం లక్షలలో: 59.30 లక్షలు, ప్రారంభ తేదీ & సమయం: 09.03.2026 మ.3.00 గం. బిడ్ స్వీకరణలకు చివరి తేదీ & సమయం: 16.03.2026 మ.3.00 గం. టెండర్ ఆహ్వానించే అథారిటీ వివరాలు మొబైల్ నం.తో: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సెల్ నం: 9989930549. హెడ్ డ్రాఫ్ట్‌మన్ సెల్ నం: 8712034411. తదుపరి వివరాలు ఇ–ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జీడిమెట్ల సర్కిల్-55, CMC,
DIPR.No.16610-PP/CL/Advt/1/2025-26, తేది: 07.03.2026

**PUBLIC NOTICE**

The General Public is here by Informed that, my client **Shri Kuppa Balaram Prasad,** S/o Late Kuppa Narasimha Sastry, R/o.H.No. 2-2-1136/3/1 Jayalaskhminivas, New Nallakunta, Hyderabad-500044. My client would like to proceed the matter against the persons i.e **1) Kuppa Bhaskar** S/O Late Kuppa Narasimha Sastry Rhuthu Dhamas Vempati Srinivasa, Fino 403, H.No 2-2-1137/5/C.D., Behind mother dairy park, New Nallakunta, Hyderabad - 500044. **2) Kuppa Srinivasa Prasad,** S/o Late Kuppa Narasimha Sastry, H.No 2-20-3-35-1, Street no 3, near pochamma temple, Adarsh nagar, Uppal (Ranga Reddy Dist), 500039 and **3) Jonnalagadda Aruna Kumari,** W/O Hanuma Kumar D/O Late K. Narasimha Sastry H.no: 2-78 China Muttevi, Movva (Mandal) Krishna (Dist) who are not the absolute owners of the property i.e the Flat No. 102, Ground Floor, admeasuring 620 Sq.feet, including common area and balconies with undivided share of land 50 Sq.yards in premises H.No. 2-2-1136/3/A, Vijaylaxmi Nivas, New Nallakunta, Hyderabad and bounded by **North** : Car Parking, **South**: Flat No. 103, **East**:Open Land, **West**: Passage and Scooter parking. In this connection, If any person/s purchase the flat with their own Interest they will be held responsible on their own costs.

**G. V. V. A. PRASANNAM, HIGH COURT-ADVOCATE**
H.No.2-2-1130/1/A, New Nallkunta, Hyderabad-44. Cell: 9849303488

**IN THE COURT OF THE HON'BLE III ADDL. JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT AT: MEDCHAL**
**O.S No: 68 OF 2026**

BETWEEN
**Sri Medisani Narsa Reddy & other** ...**Plaintiffs.**
And
1. The Tahsildar, Mudchintalpally, Medchal-Malkajgiri District.
2. To,
**All concerned.** ....**Defendant**

**PUBLIC NOTICE**

Please take notice that the Plaintiff Sri. Medisani Narsa Reddy & other R/o. H.No: 3-56/2, Jaganguda Village, Mudchintal pally Mandal, Medchal-Malkajgiri District- 500078, have filed the above suit against the Defendants. Vide O.S No: 68/2026 on the file of the above said Hon'ble court praying to declare the plaintiff's as legal heir of Late Medisani Lakshmi W/o Medisani Narsa Reddy and the said suit stands posted on **23-03-2026,** if having any objection in granting said relief may appear before this Hon'ble court on **23-03-2026 at 10.30 A.M** either in person or through Advocate failing which the matter will be heard and decide as exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//

**Sri. G. GOPAL**
**Advocate**
**Counsel for Plaintiff's**
#H.No: 9-88/1, Hakimpet, Shamirpet (M), Medchal-Malkajgiri Dist-500078, **Cell: 9666085656**
**ggopal.adv@gmail.com**

**BEFORE THE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR, TG COMPLEX, 1ST FLOOR, M.J. MARKET CIRCLE, HYDERABAD-500001. ABR/CF.NO. 692 OF 2024.**

Between:-
**M/s. Saptavandana Chits & Finances Pvt. Ltd.,** ...**Disputant.**
And
**Smt. K. Sesharajyam & Others** ...**Opponent**

**1. Smt. K. Sesha Rajyam,** W/o. P. Sri Mohana Rao, Aged about 70 Yrs., Occ: High Court Advocate, R/o. Plot. No.7, Flat. No.501, SNR Legend Apartment, Aravindra Nagar, Dommalguda, Himayat nagar-500029.
**2. Sri. P. Vijay Kumar,** S/o. P.S. Mohan Rao, Aged about 48 Yrs., Occ: Business, as Managing Director, M/s.Matrix Homes Constructions, Noor Nagar, Banjara Hills, Road. No.10, Hyderabad. Level-3, H.No.8-2-316/A/6, Road No.14, Banjara Hills, Hyderabad. R/o. Plot. No.7, Noor Nagar, Road No.10, Banjarahills, Opp: Indo American Cancer Hospital, Basavatharakam Hospital, Hyderabad.
**3. Dr. Rahul Bobba,** S/o. Rama Krishna Bobba, Aged about 48 Yrs., Occ: Business as Chairman, M/s.Advaita Life Sciencies, 3rd Floor, H.No.8-2-316/A/6, Road No.14, Banjara Hills, Hyderabad. R/o. Villa No.7, Prajay Medowes, Banjara Hills, Backside Ankura Children & Womens Hospital, Hyderabad.
**4. Sri. E. Sandeep,** S/o. Bhagawan das, Aged about 40 Yrs., Occ: Business as Proprietor, M/s.Squeure Constructions, Hyderabad. L.H. Flat. No.803, Block No.16, Lanco Hills, Manikonda, Hyderabad.

Whereas the above named Disputant the above claim petition filed against you, for recovery of **Rs.12,38,990/-**. The above claim petition is posted to dated **31-03-2026** for your appearance. You are hereby Notice to appear either in person or through pleader with your defence if any at **12.00 A.M.** On the above said date before the Hon'ble Deputy Registrar of Chits, failing which the above said claim petition will be heard and determined exparte.

"BY ORDER"
(ARBITRATOR AND DISTRICT/ DEPUTY REGISTRAR OF CHITS)
**A. LAVAN KUMAR**
**Advocate,**
#408, Swapnalok Complex, S.D.Road, Secunderabad.

### మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులు : ఎమ్మెల్యే బలాల



ఎల్ సి హెచ్ కాలనిలో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల, చిత్రంలో కాలనీ అధ్యక్షుడు ఖాసిం, సలహాదారులు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సూర్యం, నిర్వాహకులు ముజ్జు తదితరులు

**మలక్ పేట, మార్చ్ 7,ప్రభాతవార్త:**

ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని ప్రతీకగానిలుస్తాయని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. సైదాబాద్ డివిజన్ ఎల్ సి హెచ్ కాలనీలో స్థానిక నాయకులు ముజ్జు బృందం, ఎల్ సి హెచ్ కాలనీ యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే అహ్మద్ బలాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ ఇఫ్తార్ విందులు ఐక్యత, స్నేహ భావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఇఫ్తార్ విందులను నిర్వహించుకోవడంతో మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ప్రజలందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని, ఉత్సవాలను కలిసిమెలిసి శాంతి యుత వాతావరణంలో, ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మలక్ పేట్ నియోజకవర్గ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు.కార్యక్రమంలో ఎల్సి హెచ్ కాలనీ సంక్షేమ సం ఘం అధ్యక్షులు ఖాసిం, సలహాదారులు వెంకటేశం, ప్రధాన కార్యదర్శి సూర్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీ సలీం, నిర్వాహకులు ముజ్జు, నాయకులు సుమంత్,జావిద్, మాజీత్ తదితరులు పాల్గొన్నారు.

### షిరిడి సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్‌గా టీఎస్ సహదేవ్

**మల్కాజిగిరి మార్చ్ 7,ప్రభాతవార్త:**

సైనిక్ పురి సాయిపురి శ్రీ శిరిడి సాయిబాబా నూతన ఆలయ కమిటీ అధ్యక్షుడిగా టీఎస్ సహదేవుని ఎనుకున్నారు . ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులంతా సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆలే నూతన కమిటీ అధ్యక్షునిగా టీఎస్ సహదేవ్, ఉపాధ్యక్షునిగా ఆర్ యజ్ఞ నారాయణ, ప్రధాన కార్యదర్శిగా కె పార్థసారథి, సహాయ కార్యదర్శిగా బి కృష్ణ, కోశాధికారిగా కె ఎస్ నాయర్, కార్యవర్గ సభ్యులుగా ఆర్ లక్ష్మారెడ్డి, వి ఎం జి కే మూర్తి, పి రంగనాథ చార్యులు, పి వెంకటేశ్వర, రెడ్డి సత్య నారాయణ, మరి చెన్నారెడ్డి లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాటు చేస్తున్నామన్నారు .

### సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం: ఎమ్మెల్యే



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే

**హయత్ నగర్, మార్చి 7 ప్రభాతవార్త :**

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. పెద్ద అంబర్పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్మెట్ మండల్ కి చెందిన 41 మందికి మంజూరైనా 16.98 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన శనివారం లబ్దిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ... పేద మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి , కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, కొత్త కురుమ మంగమ్మ, మాజీ జెడ్పిటిసి దాస్ గౌడ్ పాల్గొన్నారు.

### స్త్రీలను గౌరవిస్తేనే సమాజం వృద్ధి చెందుతుంది
### లయన్ డాక్టర్ మండా సురేష్...



సెయింట్ థెరీసా ప్రిన్సిపల్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లైన్స్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ..

**కుషాయిగూడ మార్చి 7 ప్రభాతవార్త.**

స్త్రీలు ఎక్కడ గౌరవింపబడతారో అట్టి సమాజం అత్యంత వృద్ధి లోకి వస్తుందని లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 320 సి సెకండ్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మండా సురేష్ పేర్కొన్నారు. ఉమెన్స్ డే ను పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని డాక్టర్ ఏఎస్ రావు నగర్ లో గల సెయింట్ థెరీసా పాఠశాలలో ప్రిన్సిపల్ సిస్టర్ సుధా వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ లీలీ పాపి లతోపాటు పలు ప్రాంతాల్లో మహిళలను భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయ చారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగి నప్పుడు రాజకీయంగా సామాజికంగా ఎదగగలుగుతారని పేర్కొన్నారు. లైఫ్ క్లబ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షులు లయన్ జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ మహిళల రాజకీయ ఎదుగదల మూలంగా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. మహిళల్లో ఉన్న పట్టుదలను ప్రతిభను గుర్తించి వారిని బాల్య దశ నుంచే విద్యా పరంగా ఆయా రంగాలలో ఎదిగే విధంగా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ లయన్ మహంకాళి నరసింహ చారి లయన్ అనంతలక్ష్మి ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

### సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం



అరుణను సన్మానిస్తున్న కాలనీవాసులు

**ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త:**

సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తా నాగోల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ చింతల అరుణ పేర్కొన్నారు. కార్పొరేటర్‌గా ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అరుణోదయకాలనీ సభ్యులు శనివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు సహకరించిన కాలనీ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజల సేవలో ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణోదయకాలనీ అధ్యక్షులు ఆర్.మధుసూదన్‌రాజు, సెక్రటరీ కే.మల్లేష్, డి.దయాకర్, అప్పారావు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమం కోసం కృషి : చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి



ఇంచార్జ్ ఎస్జీఎస్ చిలక నర్సింహారెడ్డిని సన్మానిస్తున్న డైరెక్టర్ మస్రత్ సుల్తానా, చిత్రంలో చైర్మన్ చెకోలేకర్ లక్ష్మీ & వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లు ప్రత్యూష, కిషన్ సింగ్, తదితరులు

**మలక్ పేట, మార్చ్ 7, ప్రభాతవార్త:**

రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేస్తున్నామని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ లు పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా ఆధ్వర్యంలో చైర్మన్ చెకోలెకార్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్లతో కలిసి హైదరాబాద్ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఇన్చార్జి ఎస్జిఎస్ చిలకా నరసింహారెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా చైర్మన్ చెకోలెకార్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్ మస్రత్ సుల్తానా లు మాట్లాడుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచి ఆధునికరిస్తున్నమని వివరించారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు. అదే విధంగా మార్కెట్లో రైతుల సౌకర్యార్థం నూతన టాయిలెట్ బ్లాక్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. త్వరలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నట్లు వివరించారు. ఇంచార్జ్ ఎస్జిఎస్ చిలక నరసింహారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చెకోలేకర్ లక్ష్మి, వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, డైరెక్టర్ల సహకారంతో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లలో మౌలిక సదుపాయాలు కల్పించి అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రైతుల సంక్షేమమే తమ ధ్యేయమని, వారికి మెరుగైన గిట్టుబాటు ధరను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పన్నాల రాజేందర్ రెడ్డి,ఎస్ .యు. ప్రత్యూష, బుద్ధ సత్యనారాయణ, మస్రాత్ సుల్తానా, పాశం అశోక్ గౌడ్, పి. కిషన్ సింగ్. దుగ్గు జగదీశ్, మాదారం కృష్ణ, అధికారులు పుష్ప, మాధురి, సూపర్వైజర్ పవన్, నాయకులు మహేష్, రాహుల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ భూలక్ష్మిదేవి రెండో వార్షికోత్సవ వేడుకలు



ఉప్పల్ భూలక్ష్మి అమ్మవారి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ న్యూ భరత్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ భూలక్ష్మి దేవి ఆలయం రెండో వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత రెండు రోజులుగా జరిగిన కార్యక్రమంలో వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ కమిటి అధ్యక్షుడు పి.వెంకటేష్ యాదవ్, కాలనీ అధ్యక్షుడు జాజుల నాగేశ్వర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు గంధం సంపత్‌గౌడ్, వేముల దుర్గారెడ్డి, చలపతి రావు, రఘు, విజయ్ మోహన్ పలువురు ఆలయ కమిటి నేతల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎం.రజితరెడ్డి, పలువురు పార్టీల నేతలు పాల్గొన్నారు. ఉత్సవాల సందర్భంగా. శుక్రవారం గణపతిపూజ, అంకురార్పణ,మండప ఆరాధన, అఖండ దీప స్థాపన, దీక్షా దారణ, అగ్ని ప్రతిష్ట, మహా మంగళ హారతి, మంత్ర పుష్ప, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం గణపతి పూజ, మండప ఆరాధన, శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి పంచామృత అభిషేకం, అలంకరణ దర్శనం, శ్రీ సూక్త మూల మంత్ర శ్రీ గణపతి పూజ, నవగ్రహ వాస్తు పూజ, యోగిని, క్షేత్రపాలక సర్వతోభద్ర, సుదర్శన శ్రీసూక్త మాల మంత్ర హోమాలు, శ్రీ లలితా సహస్ర నామ పారాయణం, బలి ప్రదానం, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ కలక ఉద్వాసన, ఆశ్వీరచనం నిర్వహించారు. సాయంత్రం పల్లకి ఊరేగింపు నిర్వహించారు. దేవాలయం అర్చకులు వెంకటరమణ శర్మ కన్నయ్య పంతులు, రాఘవేంద్ర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, భక్తులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సఫాయి సిబ్బందికి భద్రతా పరికరాల పంపిణీ



మహిళా సఫాయిలతో సంస్థ నిర్వాహకులు

**తార్నాక, మార్చి 7 ప్రభాతవార్త :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పారిశుద్ధ్య కార్మికులను గౌరవిస్తూ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సిలికాన్ ల్యాబ్స్ సిఎస్ఆర్ నిధులతో, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సహకారంతో అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 100కి పైగా మహిళా సఫాయి సిబ్బందికి భద్రతా పరికరాలను పంపిణీ చేశారు. నగర శుభ్రతలో మహిళా పారిశుద్ధ్య కార్మికుల సేవలను గౌరవిస్తూ, వారి భద్రత, నైపుణ్యాభివృద్ధి లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల భద్రత, గౌరవం మరియు నైపుణ్యాల అభివృద్ధికి పెట్టుబడి పెట్టడం ద్వారా కుటుంబాలు, సమాజాలు మరియు నగర అభివృద్ధికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా 100 మందికి పైగా మహిళా సఫాయి సిబ్బందికి భద్రతా బూట్లు అందజేశారు. అలాగే చెత్తను సురక్షితంగా సేకరించడం, వ్యర్థాలను సరైన విధంగా నిర్వహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. దీని ద్వారా పనిలో జరిగే ప్రమాదాలను తగ్గించి రోజువారీ భద్రతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ కార్యక్రమానికి సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ నర్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి, నర్సింగి సర్కిల్ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డా. కె.ఎస్. రవి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ టి. కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ, సమాజం కోసం కష్టపడుతున్న మహిళా సఫాయి మిత్రుల సంక్షేమాన్ని మెరుగుపరచడంలో ఇలాంటి సహకార కార్యక్రమాలు ఎంతో కీలకమని తెలిపారు. అనుభూతి వెల్ఫేర్ ఫౌండేషన్ హెడ్ - ప్రాజెక్ట్స్ జోసెఫ్ మాట్లాడుతూ, మహిళా సఫాయి మిత్రులు పారిశుద్ధ్య వ్యవస్థకు బలమైన ఆధారం అని అన్నారు. వారి ఆరోగ్యం, భద్రత అవసరాలు చాలా సార్లు గుర్తింపు పొందవని, ఈ కార్యక్రమం ద్వారా వారికి అవసరమైన భద్రతా పరికరాలు అందించడంతో పాటు చెత్తను సురక్షితంగా నిర్వహించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

## కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో దశల వారీగా అభివృద్ధి : కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి



నిర్మాణానికి నోచని అంతర్గత రోడ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో దశల వారీగా సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నాదర్‌గుల్ డివిజన్-57 పార్టీ ముఖ్య నేత నవారు మల్లారెడ్డి స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా ఆయన శనివారం డివిజన్‌లోని అల్మాస్‌గూడ రామిడి హిల్స్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులతో కలిసి పాదయాత్రలు చేస్తూ నిర్మాణానికి నోచని అంతర్గత రహదారులు, స్థానిక పోచమ్మ కుంటలోకి చేరుతున్న మురికి నీరు, సక్రమంగా లేని సానిటేషన్ తదితర సమస్యలను పరిశీలించారు. ఈ మేరకు ఆయా సమస్యలతో పాటు దోమల బెడద వల్ల కలుగుతున్న ఇబ్బందులను ఆయనకు వివరించారు. అనంతరం మల్లారెడ్డి స్పందిస్తూ స్థానిక కాలనీ సమస్యలను సర్కిల్ అధికారులకు వివరించి తప్పకుండా పరిష్కారం అయ్యే విధంగా చూస్తామని హామీనిచ్చారు. ఎగువ కాలనీల నుండి వచ్చే మురికి నీరు సాఫీగా వెళ్లడానికి ట్రంక్ లైన్ ఏర్పాటు విషయమై బడంగ్‌పేట్ డిసితో చర్చించి పనులకు సంబంధించి అంచనా వేయించి జిల్లా ఇంఛార్జి మంత్రి శ్రీధర్‌బాబు, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్‌ల ద్వారా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానిక సమస్యల శాశ్వత పరిష్కారం కోసం తాము కాంగ్రెస్ పార్టీ తరపున పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామిడి బాల్‌రెడ్డి, మల్లేష్, చిరంజీవి, సైదా నాయక్, రామకృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడానికి నారాయణ పాఠశాలలు కృషి : ఏజీఎం రవీంద్రబాబు



చిన్నారులచే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నారాయణ ఏజీఎం రవీంద్రబాబు: చిత్రంలో ప్రిన్సిపాల్ బాబ్జి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించడానికి నారాయణ పాఠశాలలు కృషి చేస్తున్నాయని ఏజీఎం రవీంద్ర బాబు స్పష్టం చేశారు. మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యార్థి నేతృత్వ సమావేశ కార్యక్రమానికి ఆయన జీఎం గోపాల్‌రెడ్డితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారిచే లాంఛనంగా రిబ్బన్ కట్ చేయించి ఆయన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రవీంద్ర బాబు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలలో తాము నేర్చుకున్న విషయాలను, చేసిన ప్రాజెక్టులను ఈ కార్యక్రమంలో చక్కగా వివరించడం హర్షణీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరిగి ఆత్మ విశ్వాసం పెరుగుతుందని ఆయన అన్నారు. ప్రతి విద్యార్థిలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెంచే విధంగా నారాయణ పాఠశాల కార్యక్రమాలు ఉంటాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ కిడ్స్ ఆర్అండ్‌డి మీన, సిట ప్రియాంక, ఎట మాధవి, ఎడి రాజేందర్, విపి ధరణి, అనూష, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కమలం గూటికి చేరనున్న బిఆర్ఎస్ నేత మేకల రవీందర్‌రెడ్డి

**సరూర్‌నగర్, మార్చి 7 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని జిల్లెల గూడ గ్రామానికి చెందిన కీలక నాయకుడైన మాజీ ఉప సర్పంచ్, సరూర్‌నగర్ మండల బిఆర్ఎస్ పార్టీ పూర్వ అధ్యక్షుడు మేకల రవీందర్‌రెడ్డి ఆ పార్టీని వీడి బిజెపిలో చేరనున్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో ఉన్న సీనియర్ నేత రవీందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్న సమయంలో 1995లో జిల్లెలగూడ గ్రామ పంచాయతీ వార్డు మెంబర్‌గా ఆ తర్వాత 2006లో ఉప సర్పంచ్‌గా గ్రామానికి సేవలు అందించారు. 2014లో టిఆర్ఎస్‌లో చేరి 2016 లో సరూర్‌నగర్ మండల పార్టీ అధ్యక్షునిగా బాధ్యతలు తీసుకున్న ఆయన ఆ తర్వాత 2020లో జరిగిన మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో స్థానిక 22వ డివిజన్ నుండి తన సతీమణి మేకల విజయలక్ష్మిని కాంగ్రెస్ అభ్యర్థినిపై 203 ఓట్ల ఆధిక్యతతో గెలిపించుకున్నారు. అయితే గతంలో మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నప్పుడు తాజాగా జిహెచ్ఎంసిలో విలీనమైనా జిల్లెలగూడ, మీర్‌పేట్‌లలో అభివృద్ధి పనులు సరిగ్గా జరగకపోవడం.. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో ఆయన గత కొంత కాలంగా అసంతృప్తితో ఉంటూ పార్టీకి దూరంగా ఉంటున్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం పోయి కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా పరిస్థితిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం.. కనీసం అభివృద్ధి పనుల టెండర్లు చేయకపోవడం... హైదరాబాద్, బడంగ్‌పేట్‌లలో కంటే మీర్‌పేట్ కార్పొరేషన్‌లో ఐదు రెట్లు పెరిగి అధికంగా ఉన్న ఇంటి పన్నులను ఏ ప్రభుత్వాలు తగ్గించకపోవడంతో ఆయన పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఆయన బిఆర్ఎస్ పార్టీకి చెందిన తను వర్గీయులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లెల గూడ వివేకానంద చౌరస్తా నుండి ర్యాలీగా నాంపల్లిలోని రాష్ట్ర బిజెపి కార్యాలయానికి వెళ్లి అక్కడ తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచందర్‌రావు సమక్షంలో పార్టీ కండువా కప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం జిల్లెలగూడ, మీర్‌పేట్ డివిజన్లలో ఆయన చేరికను స్వాగతిస్తూ పలువురు నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

## జన ఔషధి పథకం ద్వారా తక్కువ ధరలకు నాణ్యమైన మందులు : ఎంపి ఈటల



**నేరేడ్‌మెట్, మార్చి 7,ప్రభాతవార్త :**

నేరేడ్మెట్ డివిజన్ ఆర్కేపురం ఆఫీసర్స్ కాలనీలోని గీతా జ్ఞాన్ భవన్‌లో గోపు రమణా రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పథకం వార్షికోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అమలు చేస్తున్న భారతీయ జన ఔషధి పథకం ద్వారా ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన మందులు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. సాధారణ ప్రజలు, మధ్యతరగతి కుటుంబాలు, వృద్ధులు, పేదలకు వైద్య ఖర్చులను తగ్గించడంలో ఈ పథకం ఎంతో ఉపయోగకరంగా మారిందన్నారు. కార్యక్రమంలో నేరేడ్మెట్ మాజీ కార్పొరేటర్ కొతపల్లి మీనా ఉపేందర్ రెడ్డి, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, మాజీ కార్పొరేటర్లు రాజ్యలక్ష్మి, శ్రవణ్, సీనియర్ నాయకుడు కొతపల్లి ఉపేందర్ రెడ్డి, సత్యనారాయణ, సుధాకర్, శ్యామ్, సాయి, ఆకారం సాయి, మహాపాత్ర, సుదర్శని, ప్రసన్న తదితర కాలనీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### వెంకటేశ్వరకాలనీలో ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న కాలనీ మహిళలు

**హుడాకాంప్లెక్స్,6 మార్చి, ప్రభాతవార్త :**

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సరూర్‌నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీలో మహిళా దినోత్సవ వేడుకలు రోడ్డు నెంబరు 3లోని కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సినియర్ సిటిజన్స్‌లను ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ వేడుకల్లో డివిజన్ తాజామాజీ కార్పొరేటర్ అకుల శ్రీవాణి పాల్గోని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండి దేశం అభివృద్ధి చెందడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు అనురాధ, ధనలక్ష్మీ, అరుణ, వసంత, శ్రీదేవి, పద్మ, హేమలత, కుశలతో పాటు అధిక సంఖ్యలో మహిళలు కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు ధనమ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మరోజు శ్రీనివాస్ రావు, కోశాధికారి సాయికిరణ్,కల్చరల్ సెక్రెటరి అర్. విజయ్‌కుమార్, సభ్యులు టి.శ్రీనివాస్‌రావు, కిరణ్ యాదవ్,బాల్‌రాజ్‌గుప్తా, సుధాకర్ చారి,మునగాల నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయంలో వెబ్ సిరీస్ పూజా కార్యక్రమం



కార్యక్రమంలో పాల్గొన్న చంద్రశేఖర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, మార్చి 7 ప్రభాతవార్త:**

చైతన్యపురి డివిజన్ ఫణిగిరికాలనీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సినిమాటోగ్రాఫర్ సుధాకర్ ఆధ్వర్యంలో వెబ్ సిరీస్ పూజ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో చైతన్యపురి బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓనర్ గారి అమ్మాయి వెబ్ సిరీస్ కథను డైరెక్టర్‌కి అందజేసి నటులకు, టీమ్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అజయ్, లక్ష్మణ్, నిరంజన్, జలంధర్, నరేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ సామాగ్రి పంపిణీ చేస్తున్న నల్ల రఘుమారెడ్డి

**సైదాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుతూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం పాలక మండలి మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి అన్నారు. రాబోయే వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని చంపాపేట జడ్పిహెచ్ఎస్‌లోని 120 మంది విద్యార్థులకు ఆయన స్వంత ఖర్చుతో స్టేషనరీ సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రఘుమారెడ్డి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన మొదటి విద్యార్థికి రూ.10వేలు, రెండవ విద్యార్థికి రూ.5 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తానని రఘుమారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయ, నాయకులు నిషికాంత్‌రెడ్డి, బాలకృష్ణ, గౌడూరు గౌతంరెడ్డి, నితీష్, రాజశేఖర్‌రెడ్డి, సామ శ్రీధర్‌రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

### లాలాగూడలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**తార్నాక, మార్చి 7 ప్రభాతవార్త :** లాలాగూడలో గుర్తుతెలియని వ్యక్తి మృతిలాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించిన సంఘటన చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుకారాం గేట్ సమీపంలోని అడ్డగుట్ట రైల్వే క్రాసింగ్ పక్కన ఓ వ్యక్తి మృతి చెందినట్లు స్థానికులు సమాచారమివ్వడంతో లాలాగూడ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి పరిసర ప్రాంతాల్లో ఆరా తీశారు.అయితే మృతుడి గురించి ఎటువంటి వివరాలు తెలియరాలేదు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ప్రాథమికంగా ఫిట్స్ (అపస్మారక వ్యాధి) కారణంగా మృతి చెందిన అవకాశముందని భావిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లాలాగూడ పోలీసులు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

### పద్మానగర్, న్యూ పద్మానగర్‌లలో పర్యటించిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, మార్చి 7 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్‌లోని పద్మానగర్, న్యూ పద్మానగర్‌లలో ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో చిన్నపాటి వర్షం పడినా కాలనీలు జలమయమయ్యేవని, అయితే సమస్య శాశ్వత పరిష్కారానికి ఎస్ఎన్‌డిపి పనుల్లో భాగంగా బాక్స్ డ్రెయిన్స్, ట్రంక్‌లైన్స్ నిర్మిస్తున్నామని అన్నారు. బాక్స్ డ్రెయిన్ పనులు తుదిదశకు చేరుకున్నాయని అన్నారు. బాక్స్ డ్రెయిన్ నిర్మాణం పూర్తయిన అనంతరం సిసి రోడ్ల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కొన్ని కాలనీలలో సిసి కెమరాలు, డ్రెయిన్స్ తదితర పనులను దశలవారీగా పూర్తి చేయడం జరుగుతుందన్నారు. నూతనంగా రోడ్ల నిర్మాణం చేపట్టే సమయంలో రోడ్డు మధ్యలో ఉన్న కరెంటు స్థంబాలను పక్కకు మార్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్, భవ్య, నాయకులు ముదుపు రాజిరెడ్డి, బొక్క సదానందరెడ్డి, గండికోట శ్రీనాథ్, సుంకోజు కృష్ణమాచారి, రవి ముదిరాజ్, ఒరుగంటి వెంకటేష్, చీర శ్రీనివాస్, మల్లేష్‌గౌడ్, ఉమామహేశ్వర్, యాదిరెడ్డి, రమాదేవి, కల్పన, ఉదయ్‌నగర్, సామ సరస్వతినగర్, క్రాంతినగర్, ఎంఆర్ఆర్ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

### ఉప్పల్ భగాయత్‌లోనే ఎంఎంసి కార్యాలయం : ఎమ్మెల్యే



ఉప్పల్ భగాయత్‌లో కమిషనరేట్ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో మల్కాజిగిరి మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయం నిర్మించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితోపాటు, బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ రాగిడి లక్ష్మారెడ్డి, పలువురు పార్టీ నేతలతో కలిసి భగాయత్‌లోని స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డితో చర్చించి కమిషనరేట్ ఉప్పల్ భగాయత్‌లో ఏర్పాటు చేసే విధంగా తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. స్థలాన్ని అధికారులు చదును చేస్తున్నారని తెలిపారు. మల్కాజిగిరి కార్పొరేషన్ ఏర్పడినప్పటి నుంచి ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సరికొత్త భవనం కోసం ఉప్పల్ భగాయత్ అనువైన స్థలమని ప్రభుత్వ పెద్దల ఆలోచన చేశారని తెలిపారు. నగరానికి చేరువలో, భౌగోళికంగా మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో ఉప్పల్ కేంద్ర బిందువుగా ఉండడం, విశాలమైన, అనువైన స్థలం ఉండడం ఇక్కడే కార్పొరేషన్ కార్యాలయం అనువుగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

### ప్రజలకి ప్రభుత్వాలకి మధ్య మీడియా వారధిగా పని చేయాలి: రవీంద్ర చారి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రాచారి

**హయత్ నగర్, మార్చి 7 ప్రభాతవార్త :**

ప్రజాస్వామ్యంలో శాసనసభ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయవ్యవస్థతో పాటు మీడియా అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ అన్నారు. రావి నారాయణ రెడ్డి భూ పోరాట కేంద్రాలో శనివారం నిర్వహించిన సోషల్ మీడియా ఆక్టివిస్ట్ ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకి, ప్రభుత్వాలకి మీడియా వారధిగా పని చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభం అయిన మీడియా ప్రజల సమస్యలని పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకు పోవాలన్నారు. ప్రభుత్వాలకి, రాజకీయ పార్టీలకి కరపత్రంగా వ్యవహరించరాదన్నారు. భూ పోరాట కేంద్రంలో వేల మంది ప్రజలు పసి పిల్లలతో కనీస వసతులు లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని మీడియా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలు మాత్రమే రాసి ప్రభుత్వానికి చేరే విదంగా చూడాలన్నారు. తప్పుడు వార్తలు రాస్తే చట్ట పరమైన చర్యలు తప్పవన్నారు. సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ప్రజల మీద విపరీతంగా ఉందన్నారు. సోషల్ మీడియాలో చెడును పక్కన పెట్టి మంచిని మాత్రమే తీసుకొని కొత్త విషయాలు తెలుసుకోవాలన్నారు. సిపిఐ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ మర్రి శ్రీమాన్ కొత్త విషయాలని సోషల్ మీడియాకి సంబందించిన నైపుణ్యాలని కార్యకర్తలకి వివరించారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్ గా భూక్యా వినోద్ నాయక్, కో కన్వీనర్లు గా అనిల్ మరియు అశోక్ యాదవ్ లతో పాటు మొత్తం 20 మందితో కమిటీని ఎన్నుకున్నారు....కార్యక్రమంలో నాయకులు ముత్యాల యాదిరెడ్డి, హరిసింగ్ నాయక్, మధు, యాదగిరి, పేరాల గోపి పాల్గొన్నారు.

### బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు పరిశీలన : బన్నాల గీత



బీరప్పగడ్డలో సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ బన్నాల గీత తదితరులు

**ఉప్పల్, మార్చి 7 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బీరప్ప గడ్డలో రూ.27 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను శనివారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్ర మంలో ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులు దశలవారిగా పూర్తి చేశామని తెలిపారు. ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు రోడ్డు నిర్మాణ సమయంలో పర్యవేక్షణ తప్పకుండా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ కేదార్ బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొక్కండ జగన్, ఎద్దుల కొండల్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, శ్యామ్, బాలు, స్థానిక నేతలు సత్యనారాయణ, ఆనంద్, ఇంద్రసేనారెడ్డి, శ్రీను,మురళీ,నరేష్, జ్యోతి పాల్గొన్నారు.